UNIVERSAL LIBRARY
OU_204897
UNIVERSAL LIBRARY

# THE
# Prahlada Natakam.
## A TELUGU DRAMA IN FIVE ACTS.

COMPOSED BY THE LATE

MR. D. KRISHNAMA CHARLU,

*"ANDHRA NATAKA PITHAMAHA"*,

OSMANIA UNIVERSITY
COLLEGE LIBRARY.

FOURTH EDITION

PUBLISHED BY

**D. K. Krishnama Charlu & Bros.**

PRINTED AT

Rama Vilasa Press, Bellary.

1922

*All Rights Reserved for Publishing, Translating and Staging.*

*PRICE—ONE RUPEE*

శ్రీ

# ప్రహ్లాదనాటకము.

ఇది

"ఆంధ్రనాటకపితామహ" యను బిఱుదువహించిన

## ధర్మవరం-రామకృష్ణమాచార్యుల చేత

రచియింపఁబడి

డి. కె. కృష్ణమాచార్లు, వారిసహోదరులచేఁ బ్రకటింపబడియె.

నాల్గవ కూర్పు.

బళ్ళారి

రమావిలాస ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియె.

1922

*All Rights Reserved for Publishing, Translating & Staging.*

[క్రయం రూ. 1—0—0]

# All Rights Reserved.

—:0:—

This book is registered under the Copyright Act 1912 Copyright by D. K Krishnamacharlu & Bros., Bellary. This book is fully protected by an Indian and foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language or stage it without permission or offer it for sale. A substantial Copy of words ideas contained herein constitutes an infringement of a Copyright and notice is hereby given that a suit will be filed in every case of infringement.

ఈపుస్తకము 1912 సం॥ కాఫీరైటు ఆక్టుప్రకారం రిజిష్టరు చేయబడినది. బళ్ళారి ధ॥ కె కృష్ణమాచార్యులవారి తమ్ములు కాఫీరైటు హక్కుదార్లు. ఈపుస్తకము ఇండియా కాఫీరైటు చేతను పరకీయమైన కాఫీరైటుచేతను సురక్షితమైనది. ఎవరుగాని ఈపుస్తకము సంపూర్ణముగాఁగాని యిందొకభాగముగాని తాము వేఱు ప్రకటించుటకును, మఱి యొకభాషయందు భాషాంతరీకరించి క్రయమునకిచ్చుటకును, తాము వుత్తరవు లేకనే ప్రదర్శించుటకును హక్కు యివ్వబడదు. ఇందుగల పదములుగాని, భాగములుగాని, ఏమాత్రమయిన కాఫీ చేసిన యెడల అది కాఫీరైటు నుల్లంఘించినట్లగును. అట్టివారు దావాకు పాత్రులగుదురు.

డి॥ కె. కృష్ణమాచార్యులు,

కాపిరైటుహక్కుదారుఁడు

## ఈనాటకమునందలి ముఖ్యపాత్రలు—తత్ప్రవేశముస్థళములు.

### పురుషులు.

హిరణ్యకశిపుఁడు—అం I రం 4, 5 అం II రం 1, 2-4 5 అం III రం 1, 2-4 అం IV రం 2 అం IV రం 1, 4

ప్రహ్లాదుఁడు—అం II రం 4-5 అం III రం 1, 2, 3 4 అం IV రం 1, 2, 3, 4 6 అం V రం 1, 2, 4

ఇంద్రుఁడు—అం I రం 1, 2 అం II రం 2, 3 అం V రం 4

బ్రహ్మ—అం I రం 3, 4 అం V రం 4

నారదులు—అం I రం 2' 5 అం IV రం 1, 2 అం V రం 4

బృహస్పతి—అం II రం 4

శుక్రాచార్యులు—అం III రం 1 అం IV రం 2, 3 అం V రం 4

విష్ణువు—అం II రం 1, 3

నృసింహమూర్తి—అం V రం 4

కాలనాభుడు—అం IV రం 1,2, 4

అగ్ని—అం I రం 1 అం II రం 2

యమ—అం I రం 1 అం II రం 2

వరుణ—అం I రం 1 అం II రం 2

బాలురు—అం III రం 3 అం IV రం 4, 5 అం V రం 3, 4

### స్త్రీలు.

లీలావతి—అం I రం 2, 5 అం II రం 4, 5 అం III రం 2, 4 అం IV రం 2 అం V రం 1

లక్ష్మి—అం II రం 1, 4 అం V రం 4

సరస్వతి—అం V రం 4

అప్సరలు—అం I రం 1 అం II రం 2,

రాజసభటులు సేవకులు

# కథాసంగ్రహము.

## ప్రథమాంకము

రం. 1. హిరణ్యకశిపుడు తపస్సుచేయుచు మృతిపొందెనని రంభ దేవేంద్రునికి చెప్పుట.

రం. 2. దేవేంద్రుడు చెరవట్టియున్న లీలావతిని (హిరణ్యకశిపుని భార్య) నారదుడు పోషించుట.

రం. 3. హిరణ్యకశిపుని తపోగ్ని సత్యలోకమున బ్రహ్మవఱకు వ్యాపించుట.

రం. 4. బ్రహ్మ హిరణ్యకశిపునికి వరములిచ్చుట.

రం. 5. నారదుడు లీలావతికి భక్త్యుపదేశము చేయుట. హిరణ్యకశిపుని సమాగమము.

## ద్వితీయాంకము.

రం. 1. హిరణ్యకశిపుడు వైకుంఠములో నల్లకల్లోలము చేయుట.

రం 2. హిరణ్యకశిపుడు దేవేంద్రునిపారదోలి స్వర్గముగైకొని తీవ్రమైన శాసనము లిచ్చుట.

రం. 3. ఇంద్ర బృహస్పతులు విష్ణువుతో మొరబెట్టుకొని వాగ్దానము గైకొనుట.

రం. 4. 2-3 సంవత్సరముల బాలుడైన ప్రహ్లాదుని లీలావతియాడించుట ప్రహ్లాదుని విష్ణుభక్తి.

## తృతీయాంకము.

రం. 1. 3-4 సంవత్సరములబాలుడైన ప్రహ్లాదునిహరిభక్తికి హిరణ్యకశిపుడాశ్చర్యపడి శుక్రాచార్యులతో నాలోచించుట.

రం. 2. 4-5 సంవత్సరముల వయస్సుగల ప్రహ్లాదుని భక్తి.

రం. 3. 6-7 సంవత్సరముల వయస్సుగల ప్రహ్లాదుడు పాఠశాలలో చదువుట. అతని మానోదార్ఢ్యమునకు చండామార్కు లాశ్చర్యపడుట.

రం. 4. లీలావతీ హిరణ్యకశిపులు ప్రహ్లాదుని రావించుట. ప్రహ్లాదుని వేదాంతము. హిరణ్యకశిపు నాగ్రహము. లీలావతిబోధ. ప్రహ్లాదుని కొండపైనుండి దిగువకు ద్రోయుట కాజ్ఞకలుగుట. (దీర్ఘమైన, మనోహరమైన, రంగము).

## చతుర్థాఙ్కము.

రం. 1. ప్రహ్లాదుని గిరిపతనము. నారదసమాగమము.

రం. 2. తనకు చావుగలిగెనని యెంచి పరితపించు తలిదండ్రుల ప్రహ్లాదుడు చేరుట. హిరణ్యకశిపు మహాగ్రహము. లీలావతి ద్వితీయోపదేశము, శుక్రుడు తానే ప్రహ్లాదునికి మంచివిద్య చెప్పుటకు పూనుట.

రం. 3. బడిబాలురకు ప్రహ్లాదుడాచార్యుడగుట (భక్తిరసప్రధానరంగము).

రం. 4. ప్రహ్లాదుని సముద్రమున ముంచ బ్రయత్నము బాలుర కృతజ్ఞత.

రం. 5. బడిబుడుతల యాలోచన.

రం. 6. ప్రహ్లాదుని పాములచే కరిపించుట.

## పంచమాఙ్కము.

రం. 1. ప్రహ్లాదుడు విషమును రసాయనమువలె త్రాగుట.

రం. 2. ప్రహ్లాదుని నేనుగులతో ద్రొక్కించి యగ్నిలో వైచుట.

రం. 3. ప్రహ్లాదశిష్యులనిర్ధారము.

రం. 4. నృసింహావతారము. హిరణ్యకశిపు మరణము. ప్రహ్లాదునికభయము.

మంగళం.

శ్రీ

# ప్రహ్లాదనాటకము.

—:o:—

## ప్రథమాఙ్కము-ప్రథమరంగము.

### ఇంద్రసభ.

[ప్రవేశము: ఇంద్ర-అగ్ని-యమ-వరుణ-నైరుతి.]

ఇంద్ర—దిక్పాలవరులారా! రంభాదులిన్నిదినములయ్యునదేలకో రాకయున్నారు. కార్య సాఫల్యము కలిగెనో లేదో తెలియకయున్నది.

అగ్ని—దేవేంద్రా! మనకేల యీయాలోచన? ఆహిరణ్యకశిపుఁ డెట్టి తపముఁజేసినను మనకేమికొదవ. వానినేల మనము తడవుకొనవలయు? అంతప్రయత్నించి వానితపస్సంతయు నిర్వహించి వరములఁబడసి నాకమేమైన నాక్రమింపవచ్చునా? అయ్యాదివిష్ణువు మనకు బాసటగా నుండునఱకు మనకే కొదవఁగలుగనేరదు.

వరుణ—అటుకాదు. వానిసోదరుఁడు హిరణ్యాక్షుఁడు భూమినంతయు చాపకట్టగా నెత్తికొనిపోఁబట్టెఁగదా వానినిసంహరించుటకై యాదివిష్ణు వొకయవతారము నెత్తవలసి వచ్చె. వరాహరూపమునఁబూని సంహరింపవలసివచ్చె. వీడన్ననో తన సోదరుని చావువలనఁ గలిగిన పగఁబనిఁబూని ఘోరతపమొనర్చుచున్నాఁడు. గొప్పవరము లేవైనపొందెనా వాని నిర్జించుట యసాధ్యమగు.

యమ—అంతకువచ్చిన నామహావిష్ణు నింకొక యవతారమే యెత్తుగాక. అతడవశ్యము మమురక్షింపఁగలడు.

[ప్రవేశము: రంభ-మేనక-మొదలగువారు.]

ఇంద్ర—అప్సరోవతంసములారా! సాధించితిరా?

రంభ—దేవేంద్రా! సాధించుటయేమి? సాధించుటకంటె నెక్కువైనది.

ఇంద్ర—అదియేమి? నీమాట యాశ్చర్యకరముగానున్నది.

రంభ—మాకేమియు శ్రమ యొసంగకయే యాహిరణ్యకశిపుఁడు మృతిబొందెను.

ఇంద్ర—ఏమి? ఏమి! తపమొనర్చువాఁడెట్లు మృతిబొందెను?

రంభ—మేము పోవుటకుముందే చచ్చియుండె.

ఇంద్ర—అదెట్లు తెలిసెను?

రంభ—చూచియే వచ్చియున్నారముగదా? కన్నులుమూతవడి యొడలెల్లఁజల్లఁబడి శవమై యుండె. మొట్టమొదట నింకను తపమొనర్చుచున్నాఁడనియెంచి వానియెదుట నాట్యమును గానము నెంతో యొనర్చితిమి. ఒక్కింతైన కను విప్పఁడయ్యె. శరీరమంతయు పుట్టలంబెట్టినట్లు మంటితో నిండి తలమాత్రము కన్పించుచుండె. ఇంచుకైన చలనము లేకయుండె. కొన్ని దినములు భీతిల్లియుండి మేము దవ్వుదవ్వులనే సంవిధానముల నొనర్చితిమి. ఏమియు కదలకున్నందున తుదకు ధైర్యమున వాని మోమంటితిమి. శవమునకున్న విధానమున చల్లనీళ్లుగల మృత్పాత్రయున్నట్టులుండె. శరీరము నిండియున్న మంటినిఁద్రవ్వి శరీరము నింత తాకితిమి. అదియు మంచుగడ్డపై చేయిపెట్టినట్టుండె. పదిగడియలవఱకు నూపిరియున్నదాయని పరీక్షింప నించుకంతయుఁ గానరాదయ్యె. ఆశవమునుఁబాసి దానితో నేమిపనియని యిటువచ్చితిమి.

## అనుబంధము 1

ఇంద్ర—వనితామణులారా! ఎంతసంతోషవార్తఁదెచ్చితిరి. అయిన నాకింకను సంశయ మొడమెడు. మృతిజెందినవాఁడైయున్నఁ గూర్చొనియెట్లుండె?

రంభ—అదియేమాశ్చర్యము? తపమొనర్చుచుండఁగా గాలికి నూరక శరీరముపై మన్నువడి కంఠమువరకుఁ బూడునట్లొనర్చె. తరువాత మృతిజెందె. కూర్చుండియుండుట కేమభ్యంతరము? ప్రాణమున్న నూపిరియుండదా? నాడులుండవా? ముక్కున నావి యుండదా? ఒడలు వేడియుండదా?

వరుణ—దేవేంద్రా! తపోనిష్ఠులగువారు తపమొనర్చుచు మృతిఁజెందిన విధాన మిదివఱకు నెందునువినము. ఇది కడుచిత్రముగానున్నది.

ఇంద్ర—వీరు చూచియే వచ్చియున్నారుగదా? ఇంకేటిసంశయము? మృతిజెందియుండెనా సరియేకదా, చావకున్న నింకకొన్నినాళ్లకైనఁ జావఁగలఁడు. ఎట్లు నీవార్త సంతోషజనకమయగు. అప్సరోవతంసములారా! మీరుతెచ్చియున్న యీసంతోషవార్తవలన నాకుపరమానందముజనించె. ఇంకముందు కార్యముల యోచింపవలయు. దిక్పాలకులారా! ఆరాక్షసుని భార్యయగు లీలావతి యెన్నినాళ్లనుండియో గర్భము ధరించి పెంచుచున్నది. ఆపుట్టగలవాఁడెట్టి క్రూరాసురుఁడగునో వాఁడు వృద్ధిజెందక మునుపే వాని సంహరించుటమేలు. నేఁదండయాత్రవెడలి యారాక్షసునిపురము నాక్రమించి లీలావతినిఁ జెరవెట్టుకొనితెచ్చి యీసురపురిని నిలిపెద. ఆమెప్రసవించిన వెంటనే యాశిశువునుఁ జక్కాడెద. రంభాదులారా! ఏది! యీసంతోషకాలమున మీనాట్యమింత తిలకింతము.

(రంభాదులు నాట్యమొనర్తురు).

(అందఱు నిష్క్రమింతురు).

—:0:—

## ప్రథమాఙ్కము-ద్వితీయరంగము.

———:o:———

### అరణ్యము.

[ప్రవేశము: దేవేంద్రుఁడు-లీలావతి]

### అనుబంధము 2

లీలా—ఆహా! నన్నుఁగాపాడు పుణ్యాత్ము లెవ్వరును లేరే. ఈ దురాత్ముఁ డొనర్చు పరిభవమువలన ననుదప్పించు కరుణాకరుఁడు లేఁడే. హా! దైవమా! (ఇంద్రునిజూచి) దురాత్మా! నీకా దేవేంద్రపదము నెవ్వరొసంగిరి? అనదనై, యబలనై, యరక్షకనై యున్న యువతీమణిపై పౌరుషముఁజూపు క్రూరుఁడవు నీవొకవీరుఁడవా? పందా! నాపతియున్నవేళ నీవు రావలసియుండె. అప్పుడు నీపేరైన నిలుచుచుండెనేమో చూచియుందువు. అసంయుక్త పతికనైయున్న నన్ను నిర్బంధించు దౌరాత్మ్యమునకు నిన్నేమనవలయును?

ఇంద్ర—అమ్మా! లీలావతీదేవీ! నీకేమియు నేనపకారముఁ గావింపను. నినుబాధింపను. నిను కన్నెత్తియైనఁ జూడను. సముచిత పతివ్రతాతిలకమవని నుతికెక్కియున్న నీకు కీడొనర్చు దురాత్ముఁడుండునే? అయిన మమ్మెల్లర నెల్లవేళల బాధించుచుండిన నీపతి యంతరించియుండ నీగర్భమున నెట్టి క్రూరుఁడు పుట్టునోయను సంశయమున నీప్రసవమువఱకు మాత్రము నిన్నుఁ జెఱయందుంచెద.

లీలా—అయ్యో! దురాత్మా! నీకిట్టిదుర్బుద్ధియా? అపరాధమనుమాట యించుకైన యెఱుఁగని కసిగందువును సంహరింపనెంచితివా? నీవనాథయువతుల బాధించు పందవనుట మాత్రమే కాదయ్యో. నోరెఱుఁగని శిశువుల వధింపనెంచు పాపాత్ముఁడవు సహితమగుదువే. ఛీ! నీప్రభవమేటికి? నీపురుషజన్మమేటికి?

[ప్రవేశము: నారదుఁడు.]

### అనుబంధము 3

ఇంద్ర—నారద ఋషులకు వందనము. ఎక్కడనుంచి విచ్చేయుట. (నమస్కరించును).

లీలా—(నమస్కరించి) మహాత్మా! ఋషితిలకా! నీవైన రక్షింపుము. చూడుము ఈభీరుఁడన్యాయముగ ననుఁ జెఱవట్టియున్నాఁడు.

నారద—దేవేంద్రా! ఎవ్వరీతరుణీమణి?

ఇంద్ర—నారదా! నీవు చూడలేదా? దురాత్ముఁడగు హిరణ్యకశిపుమహిషి లీలావతి.

నారద—ఆమె యిక్కడికెట్లువచ్చె ?

ఇంద్ర—చెఱవట్టి నేదెచ్చితి.

నారద—అట్లయిన దేవేంద్రా! నినుఁబోలిన శూరులు లోకముననుండరు. మహాశక్తిసమేతుఁడగు హిరణ్యకశిపుని మహా ఘోరరణమునజయించి యతనిసతినిఁ జెఱవట్టితివిగదా ?

లీలా—ఋషితిలకమా! యుద్ధమా! నిరుద్ధమా. నీచాత్ముఁడు అసంయుక్త పతికనై యున్న నన్న న్యాయముగ నిర్బంధించె. నాపతి ఘోరతప మొనరించుచున్న వాఁడు అతని కాలిధూళికైన శిరమునధరించు యోగ్యత యీపాపకర్మునకుఁగలదా ?

## అనుబంధము 4

నారద—ఔనా? దేవేంద్రా! నీవాహిరణ్యకశిపుని యుద్ధభూమిని జయించలేదా ?

ఇంద్ర—మునీంద్రా! తప మొనర్చుచు నాయసురుఁడక్లై మృతిఁజెందె.

నారద—అకటా! దేవనాథా! నీవిట్టి యవివేకివగుదువే. తప మొనర్చుచున్న వారు మృతిజెందుట యెన్నఁడైనవింటివే? పోనీ, మృతిజెందుననియే యందము. ఈపతివ్రతా తిలకము నేలతెచ్చితివి? ఈమె పాతివ్రత్య మెంతని వర్ణింపవచ్చును ?

సీ. కురులుమాత్రముదువ్వి కొప్పుపెట్టుటెకాని
తోరంపుఁబూసరుల్ దుఱుమఁబోను
పాలుపారుకుంకుమ బొట్టుపెట్టుటెకాని
ముద్దుగాఁదిలకంబుఁ దిద్దఁబోదు
పాటిగానెమ్మేనఁ బసుపుపూయుటెకాని
చందనాదికముల లందఁబోదు
పతికిసేమముఁగోరి వ్రతముసేయుటెకాని
శృంగారవని విహరించఁబోదు

తే. గీ. కంటె, తాళిబొట్టు, కమ్మలు, కడియంబు
లొక్క వన్నెచీరె లొకటిరెండు
వీడియములేకాని విభవమొల్లదుతన
విభుఁడురానికతన వెలదిమిన్న.

ఇంద్ర—ఈమెగర్భమున నాయసురుతేజ మెన్నినాళ్లుండియో పెరుగుచున్నది. ఇఁక నెట్టి క్రూరాసురుఁడు పుట్టునోయనుభయమున. వానిపుట్టినప్పుడే నఱుకవలయునని తెచ్చితి.

నారద—అయ్యో! అయ్యో! ఇంత న్యాయమా? శిశుసంహరణమునకు నీవెట్లొడిగట్టితివి? నీవొక్కప్పుడు దితిగర్భముననున్న శిశువును సప్తఖండములుగా నొనర్చితివే ఫలమేమైన సమకూరెనా? అఖండములు సప్తమారుతములైనవో లేదా? ఈశిశు సంహారణ ముద్యమించితివా? అదినీచేనగునా? నీపితామహునికైన సాధ్యమగునా? ఈసతి గర్భమున నున్నవాఁడెట్టివాఁడని యెంచితివి?

మ॥ అతినైర్మల్యముగల్గివైష్ణవకిరీటాలంక్రియాయోగ్యమై
హతదోషంబున వజ్రభేద్యతరమై యష్టాంగయోగాఢ్యమై
యితరాకల్పితరంధ్రమై సురుచియై యేతన్మహాదైత్యరా
ట్సతిగర్భాఖ్యఖనింజనించు శిశువజ్రంబద్రినిర్భేదనా.

పురుషరత్నమగుఁగదా. అది శుద్ధవజ్రము. మిక్కిలి నిర్మలమైనది. ఇంతైన కళంకము లేనిది. ఉత్తమ బ్రాహ్మణజాతికంటె హెచ్చైనది. దోషమన్న నెఱుఁగనిది. అష్టాంగ యోగముల నిండినది. ఎవరికిఁగాని రంధ్ర మెఱుఁగుటకు సాధ్యముకానిది. ఏవజ్రమున నైనఁ దెగనిది. ఇంక మహాభాగవతులగు వైష్ణవ శిఖామణుల కిరీటము నలంకరింపదగిన వజ్రము. పో! పాపాత్మ! రకాసీదారిని. ఇంతయజ్ఞానివని నిన్నెఱుఁగ

ఇంద్ర—మహాత్మా! నీవలన సముచితధర్మము నేఁడువింటిని. నీమాట లేలకల్లలగు? ఈసతీమణి గర్భముననున్న శిశువు విష్ణుభక్తుఁడగునని వచించితివిగాన నాశిశువువై నాకేమియుఁ గార్పణ్యముగలుగదు.

మ॥ వనితారత్నమువైష్ణవాగ్రణినిగర్భంబందుఁదాల్చెనం
చునునీవింపుగఁబల్కఁబ్రోచితివేయీచోద్యంపువృత్తాంతముల్
వినసంతోషముగల్గెనీతరుణికిన్ విజ్ఞప్తి నేఁజేసెదన్
ననుమన్నింపఁగనీమదిన్ గొనకుమా నానేరముల్ నారదా.

(లీలావతినిజూచి) సతీతిలకమా! నాయపరాధముల మన్నింపుము. నీమహాత్త్యము నే నెఱుఁగనైతిని. నీవు వైష్ణవమాతవుకానున్నావఁట. కావున మాకెల్లరకు భజనీయవు. నాకానతిమ్ము. (నారదునితో) ఋషితిలకా! అయిన నాహిరణ్యకశిపుఁడు మృతిఁ జెందెననుట కల్లయేయగునా?

నారద—కల్లయా? నేఁడో, రేపో తపస్సాఫల్యమున వరములఁబడసి మీకొంపలార్ప రానున్నాఁడు.

మ॥ ఇదిగో శ్రీశివప్రభావమున వాణీశానుమెప్పించి మీ
పదముల్గైకొనుచున్నవాఁడ బుధ ప్రత్యర్థిసామాన్యుఁడే
త్రిదశాధీశ్వర మీఁదెఱుంగక మదోద్రేకంబుతో నేఁడు త
త్పదతీరత్నము తెచ్చినాఁడ విటులన్ శోకింప నేంతేనియున్.

ఇంద్ర—నారద! ఇట్లేల కఠినోక్తులాడెదవు? వాఁడువచ్చెనా యవశ్యమురానిమ్ము. నావజ్రాయుధముఁజూచి వాఁడు నింతమాడఁగలఁడు (లీలావతితో) పతివ్రతామతల్లికా! లెమ్ము. ఈవిమానము నారోహింపుము. నీయింట నిన్ను విడిచివచ్చెద.

నారద—ఇంద్రా! ఏమియువలదు. ఈతరుణీమణి నాయాశ్రమముననే యుండఁగలదు.

లీలా—ఋషితిలకమా! కడుపుణ్యముఁ గట్టికొంటివి. నేనీయాశ్రమముననే యుండెద. మనోహరవిధానమున నీవుగ్గడించు ధర్మములనెల్ల గ్రహించెద.

ఇంద్ర—మునీంద్రా! అట్లయిన భాగ్యము. (అని నారదునికి లీలావతికి నమస్కరించి నిష్క్రమించును).

నారద—అమ్మాయీ! నాయాశ్రమమునెడకిఁక బోవుదముగమ్ము. (నిష్క్రమి)

---

## ప్రథమాఙ్కము-తృతీయరంగము

---

### సత్యలోకము

[ప్రవేశము: బ్రహ్మ-సనకుఁడు-సనందనుఁడు-సనత్కుమారుఁడు-ఋషులు మొదలగువారు].

బ్రహ్మ—కుమారులారా! వింటిరా శివప్రభావము? ఆమహేశునిఁబోలిన దైవము వేఱొండుగలుగఁడు. అతఁడు భక్తావనుఁడు. కరుణాగుణభూషణుఁడు. ఆర్తపరితోషణుఁడు.

సనత్కు—జనకా! కర్ణామృతముగా నీవుగ్గడించిన యుమేశు మహాత్మ్యము మమ్మెంతయు నలరింపఁజేసె.

(లోపల నగ్నిప్రకాశము కనిపించును).

బ్రహ్మ—ఏమిది? ఎందో మంటయున్నట్లున్నది?

[ప్రవేశము: శీఘ్రగమనమున ఒకఋషి.]

ఋషి—విధాతా! సత్యలోకమంతయు నగ్నిచే దగ్ధంబగుచున్నది ఏమిచిత్రమో కాని నాలుకలు క్రోయుచు మంటలుమండుచున్నది. మాకందఱకుఁ గాకదగులుచున్నది కాని యిండ్లు మేడలు మండిపోకున్నవి.

బ్రహ్మ—అదే! నాపీఠమును గాకఁగొనియున్నది.

సనక—అయ్యో! మాకును దగులుకొనియె.

ఋషి—కమలాసనా! ఈమంట భూలోకమునుండి యింతవరకు నొక్కటే విధముగ నున్నది.

బ్రహ్మ—ఆహా! తెలిసెను. నాపై మనసిడి యెన్నియేండ్లనుండియో మహాఘోరతప మొనర్చుచున్న హిరణ్యకశిపుడను రాక్షసేంద్రుని తపోగ్నియిది. ఇంకఁదడియరాదు.

ఋషి—విధాతా! వాడుక్రూరాసురుడే. ఏవరములేకయే లోకములనెల్లఁ గాల్చుచుండెను. వానికి నీవరములు లభించిన యింకడుగవలెనా?

బ్రహ్మ—ఇంకఁదడియరాదు వాడెట్టివరములడిగిన నీఁదగినదే. పోయెద. నావరముల వలన నిర్భయుఁడై వాడు క్రూరకృత్యములొనర్చినా నారాయణుఁడే యున్నవాఁడు.

ఋషులు (ఎగురులాడుచు) విరించీ! పొమ్ము. పొమ్ము.

(యవనిక దిగజారును.)

———o———

## ప్రథమాఙ్కము-తురీయరంగము.

———o———

### హిరణ్యకశిపు తపోభూమి

పుట్టలో హిరణ్యకశిపుఁడుండును. తలపై మంట మండుచుండును.

[ప్రవేశము: ఆకాశమార్గమునుండి-హంసారూఢుఁడై-చతుర్ముఖుఁడు]

బ్రహ్మ—చాలింపుము. చాలింపుము. హిరణ్యకశిపూ! నీతపము మెచ్చితి. మెచ్చితి. కోరుము వలయువరముల. అయ్యో! ఇంత శుష్కించివంటిచి ఘోరరీతి తపమొనర్చు వారలుండరే.

మత్తకోకిల. ఓసురారికులేంద్ర నీవలెనుగ్రమైన తపంబుముం
జేసిచూపినవారు లేరిఁకఁ జేయువారును లేరుగా
నీసమాధికి మెచ్చితిన్దయ నీయభీష్టములిత్తునా
యాసమేటికి లెమ్ము లెమ్ము మహాత్మ కోరుము కోరికల్.

తొలుదొల్త నీయప్పటిరూపు నీకొసంగెద. లెమ్ము లెమ్ము.

(అని కమండలోదకము పైఁజల్లును).

(హిరణ్యకశిపుఁడు స్వాకారము ధరించి లేచి నమస్కరించును).

హిరణ్య—మహాత్మ! నేఁడుగదా సుదినము నేధన్యుఁడ. నేధన్యుఁడ (అని నుతించును).

సీ. కమలాసనవిధాత కంజగర్భమహాత్మ
నేనెంతవాఁడను నిను నుతింప
జగములెల్లసృజించి పొగడుగాంచి యొసంగు
లోకేశుఁడవుగదా లోకవంద్య
పురుషుని మీఁదగ స్వయంభువుఁడవై జన్మించి
విభుతఁ జెన్నారిన ప్రభుఁడవీవ
సర్వకారణుఁడవు సత్త్వరజస్తమో
గుణమయుండవు నీవ గురువిలాస

తే. గీ. భక్తజనముల పాలి కల్పకమవీవ
యాపదుద్ధారకుండ వానజుఁడవీవ
నీకుఁజతురాననునకు వాణీధవునకు
నభవునకు నమస్కృతి శతంబాచరింతు.

బ్రహ్మ—కుమారా! నీస్తవమునకు నేమెచ్చితి. వలయువరములడుగుము. ఒసంగెద.

హిరణ్య—మహాత్మా! కరుణాసముద్రుఁడవగు నీవు నను రక్షించి వరములొసంగవచ్చుట నాయభీష్టము నెఱవేఱకపోవునా? రెండుమాటలలో నాకోర్కె విన్నవించెద. నాకమరత్వమును అజేయత్వమును నొసంగుము.

బ్రహ్మ—కుమారా! ఇదిసాధ్యమా. అమరత్వమొసంగుట కెవ్వరికి సామర్థ్యము కలదు. ఆసామర్థ్యము నాకేయున్న దేవాసురులు తమసంగ్రామము మానుకొనేల. క్షీరసాగర మథనప్రయత్నమేల? విష్ణువునకు కూర్మావతారముఁ గల్పింపనేల? సముద్రమునకు పుత్ర పుత్రికోదయము గలుగనేల? శంకరుడు గరళకంఠుఁడనిపించుకొననేల. అంత యల్లకల్లోలము కలుగనేల? కావున దానినిమానుము. ఇట్లాడుట నీకీరాదనికాదు. నాకు సాధ్యముకాదనియే? వేఱువరము లెవ్వియైన నడుగుము.

హిరణ్య—భాషానాథా! ఆవరములిచ్చుటకు నీకు సాధ్యములేదన్న నేనేమనగలను? విపులరీతిగా నమరత్వము వలని ఫలమునకు సదృశమైనఫలము గలిగించువరముల నే నడిగెద. కోపగింపకుము. నాకుపగటివేళనైన, రాత్రినైన, శుష్కాయుధమునైన, అర్ద్రాయుధమునైన, పంచజాతిక ప్రాణులచేనైన, మృగములచేనైన, మృగేతరముల చేనైన, నింటనైన నింటివెలినైన, అరణ్యమునైన, బర్వతమునైన, దరుగుల్మలతాదులనైన నెట్టిలోహములనైన, మృత్పదార్థములనైన, నగ్నినైన, జలమునైన, దేవయోనులచేనైన, నరవానరులచేనైన, జగమున నిపుడుపుట్టి వెలయుచున్న యేప్రాణిచేనైన, నేపక్షి వితానముచేనైన, ఉరగాదిసరీసృపములచేనైన, పిండజములచేనైన, అండజములచేనైన, శిలాకంటకాదులచేనైన నాకు మృతికలుగకుండవరమిమ్ము.

సీ. పరమేష్ఠి నేఁగోరు వరములనెల్లనీ
విచ్చెదనంటివే యీఁగదయ్య
నీవుసృజించిన నిఖిల భూతములచే
నన్యులచేత గేహంబులోన
బయటను భూమినిఁ బగలింటరాత్రిని
నగసురాసురమృగనాగముఖ్య
జీవులచేతనిర్జీవులచేతను నశియింపకుండ జన్యంబులందు

తే. గీ. నప్రతిద్వంద్వపౌరుషమఖిలలోక
పాలమహిమంబు సర్వాధిపత్యమై భ
వంబుచిరకీర్తి యసమతేజంబుశక్తి
యింపుమీఱంగనొసఁగి మన్నింపుమయ్య.

బ్రహ్మ—ఇచ్చితిని. నీతనువమానుష భేద్యము. అజంతుతరుచ్ఛేద్యము. నలోహాదివి భేద్యము నఖరాయుధ భేద్యమగుగాక.

(యవనికదిగజారును)

———o———

## పఞ్చమరంగము-నారదునియాశ్రమము.

[ప్రవేశము: లీలావతి, నారదుఁడు].

నారద—కుమారీ! వింటివా? కర్మబంధమోచనమగు నీయ్యితిహాసము. ఇట్టేముముక్షులైన జీవులు తమయభీష్టములఁ బడయుదురు. జ్ఞానులగు వారికి కర్మావరోధము లేదు. అదిలేకున్న జగమంతయు విష్ణుమయమనియు జనులందఱు సహోదరప్రాయులనియు బుద్ధిపొడమును. జ్ఞానచక్షువుల నింతమాత్రము తిలకించిన జగమంతయు తనయందే యిమిడియున్నట్లు శరీరికిఁదోఁచు. జ్ఞానులకు కులములేదు. జాతిలేదు. ఎవఁడు కాని నిష్కళంకపు వేదాంత జ్ఞానముఁబడసిన నతఁడు జగమునందుండు చర్యలన్నియు నిష్ప్రయోజనములని యెఱిఁగి జనులఁజూఁచి హసించు. జనసామాన్యమన్ననో, జ్ఞానియగువాని నున్మత్తునివలె భావించు. జ్ఞానమొసంగుటకును భవబంధనములఁదొలఁగించుటకును శ్రీమన్నారాయణుఁడే కారణభూతుఁడు. అతని చరణయుగళ ధ్యానముగలవానికి లోకమంతయు నశ్వరమనియు ఆత్మమాత్ర మనశ్వరమనియు దోఁచుటయేగాక అపరమాత్మని తేజమున తనయాత్మతేజము లీనముకాఁగలదినమును ప్రత్యహ మెదురుచూచుచుండు. కూతురా! వైరాగ్యము కలుగుగాక, భక్తియే యుండుఁగాక, సాధుత్వమే యలవడుఁగాక, జ్ఞానమువలన శరీరికి, గలుగు సుఖము వేఱొండువలన లభింపజాలదు.

(లీలావతి గుఱకపెట్టును).

నారద—ఆహా! ఏమాశ్చర్యమిది? ఈ సతీమణి నిద్రించుచున్నది. మైమఱచియున్నది. ఇట్లుండియు నేఁడేయు నుపదేశమును నూఁకొట్టినధ్వని వినుపించుచున్నది. అది యీ వఱకు నేను గుఱుతింపకుంటి. ఎవ్వరూఁకొట్టుచుందురు? (ప్రకాశముగా) వింటివిగదా! జ్ఞానమువలని మహాత్మ్యము.

(లీలావతి కడుపునుండివచ్చినట్లు ఊఁ అనిధ్వనివచ్చును).

నారద—(స్వగతము) ఆహా! ఇప్పుడు తెలిసె. ఇదియేమిదైవచిత్రమనవలయు? నేఁ జర్చించు వేదాంతవిషయమంతయు గర్భమునయున్న బాలకుఁడూఁకొట్టుచున్నాఁడు. ప్రతిదినమును నిదేరీతినే యాకర్ణించుచుండెఁగాబోలు (ప్రకాశము) భళిరే! ఇది యెంతగొప్పనే? ఈబాలకుఁడాగర్భవైష్ణవోత్తముఁడు కాఁగలడు. ఇట్టియనవరతము శిశువునకు వేదాంతధర్మ శ్రవణముఁగావించెద.

[ప్రవేశము: హిరణ్యకశిపుఁడు.]

హిరణ్య—(నారదునికి నమస్కరించి) నారదా! నీయుపకారము నేనెట్లుమఱువఁగలను? దేవేంద్రుఁడొనర్చిన దుడుకుతనమునంతయు నాపట్టణమున నెఱిఁగితి. నీకరుణాపారీణతయు నీగర్భవాసమున మాలీలావతియుండుటయు నెఱిఁగితి. నినుదర్శించుకొని నాకృతజ్ఞత విన్నవించుటకై నేనే—

లీలా—(దిగ్గునలేచి) నాథా! నాథా! ఎట్టిసుదినము? (అని పూర్ణాలింగనమొనర్చును).

నారద—(స్వగతము) చిరకాలమెడఁబాసియున్న మోహపూర్ణదంపతుల పరస్పరానురాగాలాపములకు నాయునికి యనభీప్సితాటంకము. నేఁబోయెద. (అనిపోవ.బోవ)

హిరణ్య—(నిలిపి) ఋషితిలకా! మాలీలావతి యను రాగవశమున మూర్ఛిల్లె. ఈతన్వికింతుపచారమొనరింపవలయు. (అనిలీలావతిని శయ్యపైఁబరుండబెట్టి శిశిరోపచారములఁ జేయుచు) నారదా! ఈ రమణీమణి కిట్టియాపదవచ్చుట కాదురాత్ముఁడగు నింద్రుఁడు గదా కారణము? వానిపని యింకఁదెలియఁగలదు. వాడింత కీడొనర్చినవాఁడైనను మాతమ్ముని నిష్కారణముగ వధించిన పాపమొనర్చిన విష్ణువు వానికంటె నాకపరాధమొనర్చినవాఁడగు. వలసినవరముల నెల్ల విరించి వలనఁగైకొంటి. నిరంకుశాధికారమున జగమునంతయు నాపాదాంగుష్ఠములోనిదిగానొనర్తు.

ఉ॥ కీడనియెంచకింతతమకించి సతీమణిఁబట్టి తెచ్చియు
న్నాఁడుగదా దురాత్ముఁడగు నాయిఁక వానినుపేక్ష సేయఁ జెం
డాడెద నేలరాచి తెగటార్చెదఁ దీర్చెదఁ నావిరోధముక్
మూడుము వానిచంద్ర బలసూదనుఁ డెంతటి పాటుఁ జెందునో.

మొట్టమొదట వైకుంఠమునకుఁబోయి నారాయణుని కాలనలిపి చంపి తరువాత శచీతరుణి మంగళసూత్రముఁ ద్రెంపఁ బ్రయత్నింతు.

లీలా—(నిద్రలో) నాథా; ఇంకనెన్ని దినములు నీతపము? ఏల ననుఁజూడరావు?

హిరణ్య—నారదా! ఈ కాంతామణి కలవరించుచున్నది. విమానమయ్యెడ నేనిలిపియున్నవాఁడ. వేగఁముపోయి పురముఁజేరెద. నీవునువిచ్చేసి యాతిథ్యము స్వీకరింపవలయునని ప్రార్థించెద.

నారద—అసురకంఠీరవా! నీవిచ్చునాతిథ్యములన్నియు నాకువచ్చెను. నాకుఁదపమునంతరాయమభీష్టము కాదు. కావున ననుమన్నింపుము. నీకుఁగలుగఁగల చిన్నకుమారుని ముచ్చటలు చూడ నింకొకసారివచ్చెదనఁటలెమ్ము.

(యవనికదిగఁజాఱును).

—(ప్రథమాంకము సమాప్తము)—

---:o:---

శ్రీ

# ప్రహ్లాద నాటకము.

## ద్వితీయాఙ్కము-ప్రథమరంగము.

### వైకుంఠము.

[విష్ణువు, లక్ష్మియు, నున్నతాసనములపై, పీతాంబర శంఖుచక్ర కిరీటాధారులై సారూప్యముక్తులు. ప్రక్కనబుషులు. సామీప్యముక్తులు].

ముక్తులు—(విష్ణువును స్తుతిచేయుచుందురు)

(వెనుక మహాధ్వని).

ఋషులు—(భయమున) లక్ష్మీరమణా! వైకుంఠమున నిట్టిధ్వని నెన్నడును వినలేదు. ఏమాశ్చర్యమిది?

విష్ణు—ఋషీశ్వరులారా! తెలిసెను. మొన్న నే వరాహరూపమున సంహారించిన హిరణ్యాక్షునవజన్ముఁడు హిరణ్యకశిపుఁడనువాఁడు అజుని మెప్పించి పడయరానివరములఁ బడసి తనతమ్ముని జంపిన పగఁదీర్చుటకై నాపైవచ్చుచున్నాఁడు.

ముక్తుడు—జనార్దనా! వానికెంత కావరమనవలయు? నీ చక్రప్రభావము నించుకంతయు సరకుగొనకవచ్చుచున్నవాడుగదా? నాకు సెలవిమ్ము. నేనిప్పుడపోయి వానినుక్కడించి వచ్చెద.

విష్ణు—కుమారా! ఇదిలగ్గు కాదు. సమయమునుగాదు. బ్రహ్మయొసంగిన వరముల నాలోచింప నింకనుకొన్ని నాళ్లువాని మననిచ్చుటయే యుక్తము. వానికిప్పుడు మంచికాలము. మనకుసాధ్యుఁడు కాడు. కొన్ని యేండ్లుకడచినపిదప తానేమడయగలడు. ముక్తులారా! నేనిపుడు వానికంటబడరాదు. పడితినా వాడవశ్యమునను జెనకు. నేసంహారింపవలసి వచ్చు. అదిమదభీష్టముగాదు.

అనుబంధము 5

కావున నే సూక్ష్మరూపముధరించి యాదనుజునికి కంటబడకుండనిభంగివాని నాసారం భ్రమముల నుశ్వాసరూపమున నడిగియుండెద. కాంతామణి! నీవెందుండఁగలవు.

లక్ష్మి—ప్రాణేశా! నన్నుడుగవలయునా? నీకప్పుడు వానిసంహరింపరాదని మనసుగలిగనో అప్పుడే వాడధిక పుణ్యాత్ముడయ్యె. నేను వానివీట నేకొన్నినాళ్లు వాసముఁ జేసెద.

[లోపల సమీపమున ఘోరధ్వని]

విష్ణు—ఇంకఁదడయుట యనుచితము. రమాసతీ! నేనుపోయెదను.

(అనిలక్ష్మితో నిష్క్రమించును)

[ప్రవేశము: హిరణ్యకశిపుఁడు పరవారముతో].

హిరణ్య—ఏడీ! యాదురాత్మకుడు. వానినుక్కడంచెద. సొక్కడించెద. ప్రక్కచించెద.

ముక్తులు—అయ్యా! నేవిష్ణువుఁగాను. చూడుమా! నాయెడలక్ష్మిలేదు? (అనియొకడు శంఖుచక్రములఁదీసివైచును. ఒకడుకిరీటముపాఱవేయును ఒకడు పితాంబరము నూడఁబీకును)

రాక్షసులు—(ముక్తుల శామములనాకి ఋషులనెత్తులపైఁగాళ్లుపెట్టి యల్లకల్లోల్లముఁ జేయుదురు).

హిరణ్య—రాక్షసోత్తములారా! ఈపందలతో మనకేమిపని? ఆదురాత్ముడు తప్పించుకొని యున్నవాఁడు. చరాచర ప్రపంచమంతయు వెదకియైన వానిబోనియ్యను. పోదమురండు వానిబట్టియుక్కడింతము.

(నిష్క్రమించును.)

---

## ద్వితీయాఙ్కము—ద్వితీయరంగము.

---

## ఇంద్రసభ

[ప్రవేశము: ఇంద్రాగ్నియమవరుణులు, ఇతర దిక్పాలురు, ఋషులు, అప్సరసలు, రంభ ఊర్వశి, మేనక మొదలగువారు]

అప్సరసలు—(గానముచేయుదురు).

ఇంద్రుఁడు—అచ్చరలారా! ఈనాడు మీగానముకడురమణీయముగానున్నది. పరమోత్సాహమునఁబాడితిరి. మిక్కిలి సంతసించితి.

(లోపల కోలాహలధ్వని)

ఇంద్రుఁడు—ఏమీ యీకలకలము?

[రాక్షససైన్యముతో హిరణ్యకశిపుఁడు]

(దేవసేనవారినడ్డగించును. రాక్షసులు దేవతలఁ బడఁద్రోయుదురు. ఇంద్రుఁడు, హా! హాయని యఱచును. హిరణ్యకశిపుఁడింద్రుని గిరీటముఁగాలదన్ని మెడఁబట్టియున్నతాసనమునుండి క్రిందికీడ్చును. అప్సరసలు పరుగెత్తనున్న హిరణ్యకశిపుఁడు వారిని నిలువఁబెట్టును. హిరణ్యకశిపుఁడింద్రుని యాసనముపైఁ గూర్చుండును).

హిరణ్య—రాక్షసులారా! ఈదేవతాధముని మొదటకట్టివేయుఁడు.

శా. ఓరీపాకవిరోధి నారమణిఁ గ్రూరోద్యోగివై పట్టితే
వేరా గర్భిణియైన కాంతయెడనా యీభంగి నీచా దయా
దూరాజ్ఞానవిహీన యన్యాయహరా, దుర్జాత దుశ్శీలనీ
వేరీతిన్ భరియింతువింకఁ జెపుమా యేనిచ్చుశిక్షావిధుల్

ఓరీఇంద్రా! నీకు మూడుమార్గములు గలిగించెద. నాకత్యంత విధేయ సేవకుడవై నా చరణములాశ్రయించి యుందువా? కారాగృహమున నుందువా? కాకున్న నీభార్యతో నీపురి వెలువడిపోయి యజ్ఞాతముండవై యెందేని యడఁగియుందువా? నీభార్యతో యని నేనంటిగదా! అందుననీయదృష్టమంచిదని నమ్ముము. కాకున్న నిరపరాధినియై భర్తదండలేకుండుట ననదయైయున్న సాధ్వీశిరోమణిని చెఱఁబట్టియాగడిపెట్టిన నీయట్టి పాపకుభార్యాసాంగత్యముఁ గలిగింపకయే నీభార్యను చెఱవట్టవలసియుండెడి. ఐనను కారుణ్యమున నా కార్యముమానితి. నీవేమందువు?

ఇంద్ర—ఇఁక నేమనగలను? నాభార్యతో వెడలిపోయెద.

హిరణ్య—అయినఁబొమ్ము. దూషణా! వీనిగొనిపొమ్ము. వీనిభార్యను. కట్టుగుడ్డలతో వీని వెంటఁబంపి పురముతొలిగించిరమ్ము.

దూషణా—చిత్తము. (అని యింద్రునిఁ దోసికొనిపోవును).

హిరణ్య—దిక్పాలకులారా! కూర్చుండుఁడు మీకు రెండుమార్గములు గలిగించెద.

అగ్ని—ప్రభువా! మేమునింద్రుడు పోయినట్లే వెడలిపోయెదము.

హిరణ్య—అదిగాదుసుఁడీ! ఆ మార్గము మీకొనరించుటకు నేసమ్మతింపను మీరుకారాగృహమున నుందురా లేక నేనిప్పుడు నియమింపబోవు దిక్పాలురకు దాసానుదాసులరైయుండి వారును నేనునుఁ బంచినపని సేయుచుందురా?

అగ్ని—మహాప్రభూ! నీయిచ్చకువచ్చినట్లు జరుపుము. కారాగృహమునకు బొమ్మంటివా యిప్పుడేపోయెదము. లేక నీకువిధేయులుగా నుండుమంటివా యట్లేయొనర్చెదము. ఇంతకంటె మమ్ముఁ బురివెడలుమంటివా యింకనుఁ గృతజ్ఞులుగానుందుము.

హిరణ్య—ఇప్పుడామార్గమంగీకరింపను. ఇదే నాభ్రాతృజులు మువ్వురను నాభాగినే
యులేవురున్నారు. వారికి దిక్పాలుర పదవుల నొసంగదె. వారిచేతిక్రింద వారుచెప్పిన
పనులొనర్చుచు మీరు కొన్నినాళ్లుండవలయు. మీరుతృప్తికరముగా మీకార్యముల
నెఱవేర్చితిరా పిదప మీరు పురము వెడలిపోవ సెలవొసంగెద. మీరుమీకార్యములఁ
చక్కఁగ నెఱవేర్పరైతిరా మిమ్ముఁ జెఱసాలనుంచెద. మీరొనర్పవలసిన కార్యములఁ
గొన్నివచించెద. మీరు వినియుండవచ్చుఁగదా విష్ణువు నాతోనోడిపోవుట.
నాతమ్ముని జంపిన పగదీరవానిఁ జెట్టునకు కట్టించి కశాఘాతములనే వానిసంహరింప
నెంచియుంటి. వాడుతప్పించుకొనియె. వైకుంఠమునంతయు నాక్రమించి యందున్న
వారినెల్ల నాచరణదాసులుగనొనర్చి యేతెంచితి. విష్ణుఁడు లేఁడాయెఁగదా ఇంద్రుడు
నిర్నామమైయ్యెఁగదా మీరెల్లరు దాసులరైతిరి. ఇంకయజ్ఞాదులొనర్చువారందఱు
"నింద్రాయస్వాహా" విష్ణవేస్వాహా" "అగ్నయేస్వాహా" యని యీతీరున నుడువుట
కింకేమికార్యము? నేనేయింద్రుడ. నేనేవిష్ణుఁడ నేనేవిష్ణుశిరచ్ఛేదకుఁడ. నేనేయం
తయు. కావున నాహుతులిచ్చువేళ నన్నిచోట్లను "హిరణ్యకశిపువేస్వాహా" యని
నేనాజ్ఞయిడియున్నానని మీరందఱికి నెఱుంగఁజేసి వారట్లాచరించులాగున నొనర్ప
వలయు. సంకల్పములు చెప్పువేళ "భగదాజ్ఞయా భగవత్ ప్రీత్యర్థం" యనుమాటల
వదలి, "హిరణ్యకశ్యపురాజ్ఞయా హిరణ్యకశిపు ప్రీత్యర్థం" మని నుడువునట్లొనర్ప
వలయు. అగ్నీ! నాపోషవర్గముననున్న జంతుసంతానమునకు శీతబాధలేమియు
లేకుండునట్లు నీవుకాచియుండవలయు. యెవ్వడైననొకఁడు నాప్రకృతిజనులలోని
వాఁడు శీతబాధచేయించక తుమ్మినా చాలును. నిన్నీడ్చుకొనిపోయినీళ్లలోఁ ద్రొక్కిం
చెద. యమా! నీయధికారము నీకేయుండనిమ్ము మాకాలనాథుని యాజ్ఞతో నెల్ల
కార్యములుఁ జరుపుచుండుము. నావిధేయుల నామిత్రుల నన్నుస్మరించువారల పాప
విమర్శయేమియుఁ జేఁయక పుణ్యలోకమునందే యుంచుము. నైరుతీ! నీయధికారము
నైతము నీకేయుంచియున్నాను. అయిన మావజ్రదంతుని యనుమతితో నీకార్యభాగ
ములు నెఱవేర్చుచుండుము. వరుణా! నీవుచేయవలయుపనియిది. నాయాజ్ఞకులోఁ
బడిన యీలోకముల యందెందుగాని యతివృష్టిదోషముల గలుగనీయ్యక సకాలమున
వర్షింపించుచు సంవత్సరమునకు మూడుపంటలుగా భూములనెల్లఁ గలిగింపుము. ఎందు
గాని వానలేదనుమాట పుట్టునట్లొనర్చితివా నీకుంజరముతోడనే నిన్నుద్రొక్కించెద.
హెచ్చరిక. సమీరా! నీకార్యమిది. ఏవేళ నాయేలుబడిగలలోకములవారెవరుగాని
యేవిధముగ నీవువీచుటకు కోరినట్లు నీవు వీవవలయు. కర్షకులు తమభూముల కెరువు
దెచ్చుకొనుశ్రమ వారికిరాదు. ఎక్కడనున్న యెరువును నీవే మోసికొనివచ్చి
యేభూమియందు యేవేళకెంత కావలయునో యంతంతవైచుచు రమ్ము ఇదిచేయుటకుఁ

దప్పితివా నినుపాములచేఁ గఱపించెద. కుబేరా! నన్నుఁ జేరినవారి కెవరికెంత ధనము కావలయునో యంతధనమిచ్చుచురావలయు నీనవనిధులపట్టివైననుమానె నాప్రకృతి జనులలో నెవ్వనికిఁగాని దరిద్రుఁడని పేరుండరాదు. యిట్లాచరించుటకుఁ దప్పితివా నీకింత కుష్ఠుజాడ్యము వచ్చునట్లొనర్చెద. అశ్వినీదేవతలతో నౌషధమిప్పించెద. మఱచితి నైరుతీ! నీవుఅశ్వనీదేవతలం బిలిపించి నాయాజ్ఞ వారికెఱింగింపుము. నాలోకమున ననుభజించు నెవ్వరికిగాని యెట్టియామయముగాని రాకుండవారుత్తరవాదిత్వము వహింపవలయునని వచింపుము. ఎవఁడుగాని యించుక తలనొప్పివలనైన బాధఁజెందుట నేవింటినా? వారినందులన్నియు పొడిచేసి నోటముక్కున కండ్లనించెదనని సాటింపుము ఈశాన్యా! ఏడీయీశాన్యుడు? అప్పుడేపోయెఁగాఁబోలు. పోవనిమ్ము. ఆభిక్షుకునితో నేమపని? అతీతదిక్పాలవరులారా! మీరందఱు దినదినము నొకసారి నాచరణసేవకువచ్చి విద్యమాన విషయములన్నియు నాకువచించుచుండవలయు. ఎవ్వఁరుగాని విష్ణుస్తుతి యొనర్చునట్లు మీరెప్పుడైన వింటిరా నాకుజెప్పవలయు. వారినే సంహారణము గావించెద. పొండింక మీకు సెలవిచ్చితి. అప్సరోవతంసములారా! మీ గాన నాట్య చాతుర్యములు దినదినమును నాకువలసుపడినవేళ వేచియుండి ప్రదర్శించుచురావలయు. ఇందుకుదప్పిన మిమ్మెల్లఁ సముద్రమున ముంచునట్లొనర్చెద.

(యవనికపడును).

---o---

## ద్వితీయాఙ్కము-తృతీయరంగము

:0:

### క్షీ ర వా రి ధి.

[ప్రవేశము: విష్ణు శేషశాయియై ప్రక్కనలక్ష్మీ ఋషులు మఱియొక ప్రక్కనుండి బృహస్పతియు నింద్రుఁడును వచ్చెదరు]

బృహస్పతి—దేవనాథా! కంటివే యీక్షీరవారాశి. ఎంతకన్నులపండువొనరుచున్నది. అంతరంగములనుండి యెంతమనోహరముగ వాయువువిసరుచున్నది. ఈయనుకూల వాయువు మనకార్యసాఫల్యమునకు సూచకముగానున్నది. అదే యయ్యెడనే రమారమణుఁడు భోగీంద్రశయ్య నలంకరించియున్నాఁడు.

సీ. వనధినొంచినయల్లు తనుధరించినపుల్గు
గలుగువాఁడు తనంత వెలుగువాఁడు
కలువఁదట్టినరూపు చిలువమెట్టినయేపుఁ
గన్నవాఁడు విధాతఁ గన్నవాఁడు
గిరినిమోసినసత్తి కరినిఁగాఁచినబత్తిఁ
దనరువాఁడు గిరీశు నెనరువాఁడు
కరువలియెరసజ్జ మురువుతామరబొజ్జ
నెసఁగువాఁడు శుభంబు లొసగువాఁడు

తే. గీ. వాలుగనులవాఁడల బిల్లువాలువాఁడు
మేలువాఁడిందిరకు జగమేలువాఁడు
జాళువాసాలు వాఁడంఘ్రిజాలువాఁడు
డాలుగలవాఁడు తనమచ్చడాలువాఁడు

(అని యిరువురును విష్ణువునకు నమస్కరింతురు.)

విష్ణువు—దేవగురువూ! దేవనాథా! ఏమివచ్చియున్నారు?

ఇంద్రుఁడు—రమారమణా! సమస్తవిషయములు కరతలామలకముగా తెలియఁగల నీవు "ఏలవచ్చితిరని"మమ్మడిగిన మేమేమి వచింపఁగలము? నీపోష్యస్వర్గముననున్న మాకెట్టి పరిభవము లెట్టిసంకటములువచ్చినను నీప్రాపున పరాభవముదప్పి యున్నాళ్లు మంటిమి ఇప్పుడు మాకైయున్న హిరణ్యకశిపునివలని పరిభవమింతయని వచింపఁజాలము. నేనొంటిగా సతీయుతుడనై యరణ్యావాస మొనర్చుచున్నవాఁడను. నాతోడి దిక్పాలుర దుఃఖమంటివా, దాని పరిమితిఁజెప్పఁజాలను. నాతోనీచరణసన్నిధికి వారెల్లరు రావలయునని యెంతయో కుతూహలమున్నను వానిదాడికి జడిసి రాఁజాలరైరి ఎవరైన విష్ణుస్తవమొనర్చినవారి మట్టుబెట్టుటకు తనయొద్దకుఁగొని రావలయునని దిక్పాలుర కారక్కసుఁడాజ్ఞ యిచ్చియున్నాఁడఁట? ఇట్టివాని నుపేక్షించియుండుట మహాత్మా! నీకుధర్మమా? నీవుమమ్ముఁ గాపాడకున్న మేమెవ్వరి శరణొందు వారము.

అనుబంధము 6

బృహస్పతి—దేవదేవా ! నిర్జరులపైన నీకెల్లప్పుడునున్న కరుణ నేఁడేలకో యుడిగెనో. నీవింత చేపట్టినవానికిఁ బ్రాభవము కలుగుగాఁక నీవుపేక్షించినవారు నిర్నములై పోవరా ? లెమ్ము. అనుగ్రహింపుము. ఆక్రూరాసురుని సంహరించి యమరులనెల్లఁ బాలింపుము. (అనినమస్కరింతురు)

విష్ణువు—మహేంద్రా ! నిర్జరగురువులారా ! లెండు. లెండు. మీరింత నన్నుఁబ్రేరేపింప వలదు. అదుష్టదనుజుఁడొనరించు క్రూరకృత్యములనెల్ల నేనెఱిఁగియే యున్నవాఁడ. ఐన నిది యదనుగాదని యిప్పటికి యూరకున్నవాఁడ. అంతలోనల ఆదానవుఁడు నీ రొమడరు రాకమునుపు నావైకుంఠమునకేతెంచి యుపమద మొనరించెను.

అనుబంధము 7

ఇట్లయినను తాళుకొంటిని. నేనుసమయనిరీక్షణ మొనరించుచున్నాను. ఆచిరకాలముననే వానిసంహారము కాఁగలదు. మీరూఱడిల్లి పొండు. వానికిఁ గలిగియున్న కుమారుఁడు ప్రహ్లాదుఁడున్నవాఁడుగదా వాఁడే యాదైత్యునికి మృత్యువుఁ దెచ్చువాఁడు. యోచింపకుఁడు. పొండు.

ఇంద్ర—॥సీ. దండంబు శార్ఙ్గకోదండోగ్ర కాండ
ప్రకాండఖండితదైత్యకాండ నీకు
బృహ— జోహారుమదగజ దోర్గ్రాహ హానగ్రాహ
గ్రాహచ్ఛిదావహస్తాత్మ నీకు
ఇంద్ర— వందనంబరవింద మందిరామందర
తుందరోరస్థలాళింద నీకు
బృహ— జేజేహ రాజాదిరాజీవపూజాస
మాజోచితాంఘ్రుపంకేజ నీకు
ఇంద్ర తే. గీ. బహునమస్కారములు చక్రపాణినీకు
బృహ— నైకసాష్టాంగములు జగన్నాథనీకు
ఇంద్ర— ప్రణుతిశతములు సురసార్వభౌమనీకు
బృహ— ననంతసేవాంజలులు సదానందనీకు

(నిష్క్రమి)

———o———

## ద్వితీయాఙ్కము-తృతీయరంగము,

———:o:———

### హిరణ్యకశిపుని యిల్లు.

[ప్రహ్లాదుఁడు రెండేండ్లవాఁడై తొట్లయందు పండుకొనియుండును ప్రహ్లాదుని నాడించుకొనుచు లీలావతి.]

అనుబంధము 8

లీలా—(బాలునిముద్దాడి తొట్లయందుంచి)

అనుబంధము 9

(తొట్లంబండబెట్టి నిద్రపుచ్చి నిష్క్రమించును.)

[ప్రవేశము: హిరణ్యకశిపుఁడు]

హిరణ్యా—అయ్యా! ప్రహ్లాదా! నిద్రించుచున్నావా? చిన్నపాపఁడ వెంతముద్దు లాడవు. (ముద్దాడును).

ప్రహ్లాద—నారాయణ! నారాయణ!

హిరణ్యా—హా! ఏమిది? ఇట్లుకలవరించుచున్నాఁడు? ఈరెండేండ్లబాలునికిఁ బ్రహ్లాదునకు నారాయణశబ్ధమెట్లు బట్టుపడియె! (లేప, ఎత్తికొని) కుమారా! ఏమంటివమ్మా?

ప్రహ్లాద—అమ్మా! అమ్మా!

హిరణ్యా—అమ్మవచ్చుచున్నదిలెమ్ము. పిలిచెదను. నీవేమిభయపడితివా? అట్లుకలవరించితివి?

ప్రహ్లాద—ఊఁ—ఊఁ!

హిరణ్యా—ఏమిచూచితివయ్యా? ఎట్లుకనఁబడియె?

ప్రహ్లాద—ఏమిలేదె.

హిరణ్యా—అయ్యా! నీవుకలఁగంటివో యెట్లో కాని యేదోయొక దుశ్శబ్దముఁబలికితివి.

ప్రహ్లాద—ఏమంటిని?

హిరణ్యా—ఏమోయంటివిలెమ్ము. ఇప్పుడేల? కుమారా! ఒక్కమాట. నీవెప్పుడైన కలఁగాంచి భీతిజెందినపుడు నాపేరు "హిరణ్యకశిపు-హిరణ్యకశిపు" యని బల్కుము. వేలొక్కరిపేరెత్తకుము.

ప్రహ్లాద—ఊఁ—

హిరణ్యా—అయ్యా! నీవెప్పుడైన నారాయణశబ్దము వినియున్నావా? లేక నీకెవరైన చెప్పియున్నారా?

ప్రహ్లాద—నాకేమలు చెప్పలేదు. కొంతుపాటలువచ్చును.

హిరణ్య—ఈ రెండేండ్ల యీడునకే పాటలు నేర్చితివా? ఎంతగట్టివాడవు (ముద్దిడుకొని) ఏవీయాపాటలు?

ప్రహ్లాద— అనుబంధము 10

హిరణ్య—(స్వ) వీని చందముగన్న నాకెంతకంటగించుచున్నది. వీనికిట్టిపాట లెవరుచెప్పి యుందురు. (ప్ర) కుమారా! మాయన్నా! యిట్టిపాటలింక మఱచిపొమ్ము.

చ. తలఁపకుమన్న యీకరణిఁ దప్పుడుపాటలు పాడకన్న వే
పలుకకుమన్న యీపాలువపాపఁపుఁ బేరులముద్దుమాటలన్
బలుకకుమన్న నాబలము చేఁబడిచచ్చిన వైరివర్ణనల్
సలుపకుమన్న దుర్జనుని సన్నుతి నిన్మనసార వేఁడెదన్

యివితప్పుడుపాటలు. మఱియొక్కపాటపాడుము.

ప్రహ్లాద— అనుబంధము 11

హిరణ్య—హా! హా! నేడేమి దుర్దినము! వీని తొక్కుపాటలకు సంతోషించవలయునా దుఃఖింపవలయునా? (ఆలింగనముచేసుకొని) అయ్యా! యీపాటలింక పాడకుము. ఇంకొకసారి నాయెదుట ననకుము. ఎవరుచెప్పిరయ్యా యీపాటలునీకు?

ప్రహ్లాద—ఓలుల్యా.

హిరణ్య—అయినని వి నీకెట్లుపట్టుపడెను?

ప్రహ్లాద—అమ్మా! అమ్మా! (అని యేడ్చును).

హిరణ్య—పోదమురమ్ము మీయమ్మయొద్దకు.

———o———

## ద్వితీయాంకము-పంచమరంగము.

---

### హిరణ్యకశిపు నగరు

[లీలావతియొకప్రక్కన హిరణ్యకశిపుఁడొకప్రక్కనకూర్చుండియుండి.]

హిరణ్యా—తరుణీ! ఇదియే నాదుఃఖము.

లీలా—పసిబిడ్డ. వాఁడేమెఱుఁగు? కొంచెము బుద్ధివచ్చిన నుపదేశింపవచ్చును.

హిరణ్యా—నాకేమియుఁ దోఁచకున్నది.

(ఇరువురుపండుకొందురు).

[ప్రవేశము: 3-4 ఏండ్ల ప్రహ్లాదుఁడు.]

ప్రహ్లాద—అమ్మా! అమ్మా! నాకుఁబాలిచ్చెదనంటివే? ఇయ్యవా? నిద్రపోయెదవా!

అనుబంధము 12

హిరణ్యా—అయ్యా! ఏమిపాటపాడితివి?

ప్రహ్లాద—ఏమిపాడితిని?

హిరణ్యా—ఎమోస్మరణయని యంటివే?

ప్రహ్లాద—ఓహో! అదియుండనీ. ఇదివినుము.

అనుబంధము 13

హిరణ్యా—(పాలునెత్తుకొని కోపముచూసిపోవును).

—( ద్వితీయాఙ్కము సమాప్తము )—

---

శ్రీ

# ప్రహ్లాదనాటకము.

—— ◌:o◌: ——

## తృతీయాఙ్కము-ప్రథమరంగము.

——o——

హిరణ్యకశిపునగరు. హిరణ్యకశిపుఁడుండును.

హిరణ్య—మాఁడేడుల బాలుఁడు వీనిచిత్రచరిత్రముఁ జూచిన నా కేమియుఁ దోచకున్నదిగదా ఎందెందు నిట్టివైపరీత్యముండునే? ఇందు కేమనవలయు? అదురాత్ముఁడగు నారాయణునిస్మరణ యొకనాఁడును మానఁడు. చిన్నప్పటినుండి యఱువదియేండ్లవఱకు హరిభక్తిలో మునిగినవారికైన యిన్ని హరికీర్తనలు వచ్చియుండవు. తోడిబాలురతో నాడుకొననైనఁ బోఁడు. కూర్చుండియుండి యేమో తలచుకొన్నట్లాకాశము వైపునఁ జూచి "శ్రీహరీ"యని కన్నీరునించును. పడకపైఁబండుకొని ముద్దుమాటలాడుచు నట్టేకన్నుమూసుకొని మాటలాడక మాకు భయముకలిగించు నట్లొక గడియసేపూరకుండి "నారాయణా"యని యల్లేచును.

సీ. ఆకసంబున నేమొ యట్టె తాఁదిలకించు
సరిమీఱియూరక సంతసించు
మనసార నెవరినో కనినట్టె వచియించు
"శౌరీ"యనుచుఁ గన్నునీరునించుఁ
బలుమాఱు హరినామములఁ బాడినటియించు
నెగరాడియూఱట నింతగాంచు
మనమాటలొకటియు విననిభంగిఁ జరించు
నలువారనూరక నవ్వునించు
తే. గీ. రాత్రియునుఁబవలును జాగరమునమించు
నెఱిఁబవలు రాత్రిఁ గొన్నాళ్ళునిద్రఁగాంచు
మేలినిద్రనదాటున మేలుకాంచు
సుతునిమాదిరిఁగాంచ నద్భుతమునించు.

పలుకులు తొక్కు పలుకులైనను పాటలుమాత్రము వ్యాకృతభావముచే నిండియుండును. ఎవ్వరు వీనికీపాటలఁ జెప్పియుందురు? వానిలో నొక్కటియైన నెందు నెవరునింతకు ముందెక్కడను వినినది కాదు వీనికివి యెక్కడపట్టుపడియుండును? అదిగో వచ్చుచున్నాఁడు.

[ప్రవేశము: ప్రహ్లాదుఁడు పాడుచు తాళము వేసుకొనుచు.]

## అనుబంధము 14

హిరణ్య—(ఆలింగనముచేసుకొని ముద్దాడి) అయ్యా! నీముద్దుపాటలువిన్న మఱియొకసారివిన నపేక్షకలుగుచున్నది కాని వానిలోనియర్థము కడుదుష్టమైనది. ఆమాటనోటనైన నుడువరాదు. ఇట్టిపాటలెక్కడ నేర్చితివి? ఇంకవాని విడిచిపెట్టుము. నామాట వినుము. నీవట్టిపాటలు పాడుటవలన నాగ్రహముఁజెంది యిన్నిమాఱులో నిన్నుఁ గొట్టవలయునని యుంకించితిని. కాని నీముద్దుమోము చూచుటవలనను నీజిలిబిలిపలుకులు వినుటవలనను దండింపలేకపోయితి. కుమారా! ఆదుష్టపు పాటలుచాలింపుము.

ప్రహ్లాద—పాటబాగున్నదయ్యా. స్వామికిఁ జోతచేసి పాడుచున్నాను. ఇదివినుము.

## అనుబంధము 15

హిరణ్య—(స్వ) నాగ్రహచారమున కేమనవలయు? ఏల యీచిన్నిపాపనికిట్టిదుర్బుద్ధి? వీనికీపాడుపాటలు లెట్లలవడియుండును? ఇదియెట్లుమాన్పింపవలయు? (ప్ర) కుమారా! నాచిన్నయన్నా! నాముద్దులయ్యా! నిను వేడికొందు. ఈపాటలు వలవదుడుగుము. మాయన్నవుగా? ఇంకొకసారి యిట్టిపాటలు పాడకుము.

ప్రహ్లాద—ఆపాటవద్దా! ఇంకొకపాటపాడెదను. (అని "జగములో" పాటపాడ నారంభింపఁగా)

హిరణ్య—(చెవులుమూసుకొని ప్రహ్లాదుని నోరుమూసి) వలదయ్యా వలదయ్యా యీపాటలు దీనియర్థము నీవెఱుఁగవు. ఆపాటలలో చెప్పఁబడినవాఁడు కడుదురాత్ముఁడు. మన కులములో బుట్టినవారెవరును వానిపేరైనఁ దలపరాదు.

ప్రహ్లాద—(పైపాట మఱియొక్క చరణముపాడి నవ్వును).

హిరణ్య—ఓరీ సేవకా! (ప్రవేశము: సేవకుఁడు) శీఘ్రమునఁబోయి యాచార్యుల వారి నిందు దయచేసి రమ్మనుము.

సేవక—చిత్తము.

హిరణ్య—ఇంకచెప్పవుగా ఆపాటలు?

ప్రహ్లాద—అదిపోనీ! వేఱొకపాటచెప్పెదను.

[ప్రవేశము: శుక్రాచార్యుఁడు]

హిరణ్య—(నమస్కరించును).

శుక్ర—రాక్షసేంద్రా! ఏల నీసేవకుఁడు కడుసంభ్రమమున నన్బిలుచుకొనివచ్చె.

హిరణ్య—గురుసత్తమా! నేనిదివఱకు నీతో వచించియుండలేదా యీప్రహ్లాదుని విచారము?

శుక్ర—ఓహో! వీనిహరికీర్తనలవిషయమా? ఇప్పుడు వీనికెన్నియేండ్లు?

హిరణ్య—ఇంక నయిదుదినములకు నాల్గవయేడు పడునున్నది.

శుక్ర—పోనీ! ఇంక నొక్కసంవత్సరమేకదా. తరువాత వానికి సరియైనవిద్య చెప్పించితిమేని యీబుద్ధిజాడ్యము తానే కుదరఁగలదు.

హిరణ్య—ఆచార్యా! అదియట్లుండుగాక. వీనినోట సాధారణముగా నూతనకీర్తనలు నేవినియున్నాను. అదియెవరు రచియించినదియో తెలియకున్నది. దారుణభంగి నా యాజ్ఞ కలిగియుండుటచే నారాష్ట్రములోని వారొక్కరును రచియించియుండరుగదా. ఇంక బాలునికన్ననో మాటలువచ్చియు రాని విధానమునన్నది పాటలోని సాహిత్యమందమూ ధీరరీతి రాజిల్లుచున్నది. ఈచిన్నపాపఁడు వాని రచియించియుండఁడుగదా? నీకిదియెట్లుప్రాప్తపడెరా యని నేనడుగ నెందో వినియున్నాననిచెప్పె. వీఁడెక్కడ వినియుండును? కడుచిత్రముగానున్నది ఆ గేయముల రచనవిశేషము నద్భుతముగా నున్నది. నూతనఫక్కి విలసిల్లుచున్నది. ఇదిచిత్రచరిత్ర. నీవేమైన నూహింపఁగలవా?

శుక్ర—ఇది నాకునుఁ విచిత్రముగాఁ దోచుచున్నది. ఇప్పుడేలఁ వానియిచ్చచొప్పునఁ బోనిమ్ము. ఐదువయేఁడు రానిమ్ము.

ప్రహ్లాద—("నాకన్నులారాఁ గాను"పాడుకొనుచుబోవును). (నిష్క్ర-9)

---:0:---

## తృతీయాఙ్కము-ద్వితీయరంగము.

---

### హిరణ్యకశిపు నగరు.

[నాల్గు సంవత్సరముల ప్రహ్లాదుఁడు పండుకొనియుండును. ప్రక్కన హిరణ్యకశిపుఁడు లీలావతియుందురు,]

లీలా—నాథా! ఇందుకేల యింతయోచింపవలయు? ఏమోపసివాఁడు ఎట్లెట్లోవానికి బుద్ధివొడమియున్నది. కొంచెము బుద్ధిగలిగినపిదప నాపిచ్చితీఱకుండునా?

హిరణ్య—అదికాదు. నాకుఁగల యాశ్చర్యమేమన్న నెందెందును నేను విననికీర్తనలు పాడుచున్నాఁడే యనియె నాయశ్చర్యము? వీనికవియెట్లువచ్చియున్నవి?

లీలా—ఔను. అదినాకునుఁ జిత్రముగానేతోఁచుచున్నది.

ప్రహ్లాద—(నిద్రలో) రమారమణా! ఇప్పుడునాకెంత యానందముగానున్నది?

హిరణ్య—చూచితివేలీలావతి! కలయందును కలువరించుచున్నాఁడు. వీనికేమికనుపించుచుండవచ్చును? నేను జయింపఁబోయియుండిన కాలమున కానరాకున్న విష్ణుఁడు మృతిజెందియుండి వీనికి భూతమై పట్టియుండునా? వానిజూచినట్లేమాటలాడుచున్నాఁడే.

ప్రహ్లాద—(నిద్రలోనుండి లేచి యట్లే కన్నులుమూసికొని పాటపాడును).

అనుబంధము 16

హిరణ్య—చూచితే తలోదరీ! వీనికి జాడ్యము మించిపోవుచువచ్చె. అదియట్లుండ నింత మనోహర గీతము వీనికెటులబ్బె?

లీలా—ఈపాట నేనెక్కడనో వినియున్నాను (జ్ఞాపకముఁజేసుకొనుట నభినయించి) ఆహా! తెలిసెను. నేనా నారదఋషి యాశ్రమమందుండు కాలమున నామునీంద్రుండీ పాటలోనిపల్లవి యని నట్లును జ్ఞాపకమునకువచ్చె

హిరణ్య—అది వీనికెట్లలవడియుండును భూతచికిత్సకులరావించి చికిత్సచేయించినఁగాని నాకూఱటగలుగదు.

లీలా—కానిమ్ము (అనిప్రహ్లాదుని నాలింగనముఁజేసికొని) బాలకా! ఏమిట్లుపిచ్చిపట్టిన చందమునఁ జేసెదవు? నీనిద్రయేమి! నీపాటయేమి అయ్యో! నీకెట్లుకనుపించుచున్నది?

ఆ. వె. అన్నయిందురార చిన్నపాపఁడరార
నీవిధంబువెఱుఁగు నించుమాకు
నిద్రపోవుటేమి నీపాటయేమినీ
కరణియేమి యెట్లుకానిపించె.

ప్రహ్లా—("మానసంబున" అనుపాట ఒకపల్లవియని) ఈపాటపాడితిసా?
లీలా—అదికాదు. వేటొక్కటి.
ప్రహ్లాద—అయిన నీపాటవినుము. ఎంతబాగుగాయున్నదో? అని మఱియొకపాట పాడును).

అనుబంధము 17

హిరణ్యా—ఇదిభూతవిధియే కుమారా! ఈపాటలన్నిఁటిని మఱచిపొమ్ము.
ప్రహ్లాద—మఱచుటయన్న నేమి?
హిరణ్యా—అవిలేవనియు, లేక నీ వెఱుఁగవనియు లేక నీకురావనియు ననుకొనుట.
ప్రహ్లాద—అయ్యా! వున్నవిలేవని యెట్లనుకొందు? వచ్చినవిరావని యెట్లనుకొందు?
హిరణ్యా—కుమారా! అవియింక ననుకొనకుము. అవిపాడితివేని నినుగొట్టెదనుసుమా?
ప్రహ్లాద—(ఏడ్చును నభినయించి) ఏలకొట్టెదవయ్యా! నేనేమి చేసితిని?
హిరణ్యా—(ప్రహ్లాదునాలింగనముచేసుకొని) ఏడ్వకుమా మాయన్నా! ఏడ్వకుము! నీయట్టి బంగారుకొండను నేనుకొట్టుదునా? ఊరక యట్లంటిగాక, నిన్నేమియుకొట్టను. ఇంక కొన్నిమాసములలో నీకైదవయేడు పడఁగలదు. అప్పుడద్జలవద్దపంపి నీకు మంచి విద్యఁ జెప్పించెదను. అప్పుడివియన్నియు మఱచిపోఁగలవు. ఏడ్వకుము (అనిముద్దాడును). (నిష్క్ర).

---

తృతీయాజ్కము-తృతీయరంగము

---

పాఠశాల

ప్రవేశము: బాలురు ప్రహ్లాదుఁడు చండుఁడు అమర్కుఁడు

చండుఁడు—ప్రహ్లాదా! నే చెప్పినశ్లోలచెప్పవు? నీతండ్రియే యిప్పుడు జగత్కర్తయు జగత్పాలకుఁడునైయున్నాఁడు కావున నతనిని స్మరించియే ముందువిద్య నభ్యసింప వలయును. అనుము. "ఓం హిరణ్యకశిపవేనమః".
ప్రహ్లాద—అయ్యా! అన్నియుఁ దెలిసిన నీవేయిట్లాడిన నెట్లు? నాతండ్రి జగత్కర్తయును జగత్పాలకుఁడునవునా? అతడు నాకు కర్తయగుటచే నతనికాళ్ళంటి జోతచేతుఁ గాక విద్యకై ముందుముందతని నుతింపుట సరియా? "ఓన్నమో నారాయణాయ యనియే నేస్మరించెద.

చండ—ఆమాటకూయకుము నీతండ్రి నినుజంపివైచును. ముందుపాఠములు కానిమ్ము
(అని పాఠముఁజెప్పును గురువు చెప్పినట్టు పఠించును).

చండ—ఇప్పుడైన నను ము. "ఓం హిరణ్యకశిపవేనమః".

ప్రహ్లాద—ఓం నమోనారాయణాయనమః".

అమర్క—(ప్రహ్లాదునిఁజంపఁగొట్టి) దుర్మార్గుఁడా! నీకింత యవిధేయతయా? బాలకు లారా! మీకు భోజనమునకు వేళయాయె. మీరెల్లరు వెడలిపొండు. ఓరీ ప్రహ్లాదా! "ఓం హిరణ్యకశిపవేనమః" యని నీవనువఱకు నీవిక్కడనే యుండవలయు కూడు లేక చావవలయు. ఏమో బాలుడవని కొన్నినాళ్లు పోవనిచ్చిన నీకింత తలబొగరు గలిగెనా? బాలకులారా! పొండు. (బాలుకులు నిష్క్ర).

చండ—ఏమి? మేముచెప్పినమాట చెప్పుదువా లేదా?

ప్రహ్లాద—మీకు మాఱుపలుకఁనగునా? పాఠముల మీరు చెప్పినదంతయు నేర్చుకొను చున్నానే.

అమర్క—ఇట్లుండవలయు బుద్ధిమంతుల లక్షణము. అనుము "ఓన్నమో హిరణ్యకశిపవే!"

ప్రహ్లాద—"ఓన్నమో నారాయణాయ"—

చండుడు—పలుగాకి ఇటుగాదునీకు శాస్తి. పడియుండుమిందు. మేము చెప్పినమాట యనుటవఱకు నీకు కూడులేదనుకొనుము. (అని అమర్కునితో నిష్క్ర).

ప్రహ్లాద—అయ్యో! వీరెంత తెలివిలేనివారు? మాతండ్రియే దైవమనుచున్నారే? లేకున్న కూడులేక చంపెదమనుచున్నారే నారాయణా! శ్రీహరీ! నీభక్తి నాకొక్కటి కలిగియుండ నాకన్నము వేఱే కావలయునా? ఈచండామర్కుల వంటివారు ననుఁ జంపువారలా? వారి తెలివి యింతయున్నది. పరమేశా! లక్ష్మీవల్లభా! ఏదీ నాకుఁ గాన్పింపుము. ఆహా! కనుపించితివా? భళిరే భళిరే (అని గంతులువేయుచు) దేవా! ఏమరల మఱుఁగయ్యెదవు? పోకుము. పోకుము. నీవోయిన నాకు దుఃఖముగలుగును (అనిపాటపాడుచుండ).

అనుబంధము 18

[ప్రవేశము: చండుఁడు అమర్కుఁడు దూరమున.]

చండుఁడు—అమర్కా! చూచితివే యీబాలుని హరిభక్తి యెంతశుభ్రమైనదనవలయు? ఆకలియనిరైన ననకున్నాఁడే. రక్షోవల్లభునికిట్టి కుమారుఁడుపుట్టెను. వీనికి నారాయణస్మరణ విడిపింపుమని శుక్రాచార్యుఁడు నియమించెఁగదా? విడుపించుటట్లుండగా స్మరణముదురుచు వచ్చెనే?

అమర్క—ఓరిచండా! మనమూరక యీబాలుని శాకలి గలిగించిన నేమి ప్రయోజనము? తుదకు ప్రభువునకు కోపమువచ్చునేమో? వానిస్మరణ వానికేయుండుఁగాక. కూడు లేక చంపిన నేమిప్రయోజనము? ఇంటికిఁ బిలుచుకొని పోదమురమ్ము.

(అని ప్రహ్లాదునియొద్దకువచ్చి) ప్రహ్లాదా!

ప్రహ్లాద—స్వామీ—వచ్చితిరా! మాశ్రీహరినిఁ జూచితిరా? కనిపించినట్టే కనిపించి నాకు కానరాకఁబోయెనే. అయ్యో! పిలువుఁడు నాకుఁజూపుడు.

చండుఁడు—కానిమ్ము. మీశ్రీహరి—గోహరి. పోదమురమ్ము. (అనిపిలుచుకొనిపోవుదురు)

---

## తృతీయాఙ్కము-తురీయరంగము.

---

హిరణ్యాకశిపు నగరు

[హిరణ్యాకశిపు లీలావతి.]

లీలా—నాథా! నాకు కుమారుఁజూడ బుద్ధిపుట్టుచున్నది. దాదాపున నాలుగెలలాయెనే వానిఁజూడక, భుజింపఁబెట్టక, తలయంటక, నీళ్లుపోయక, ముద్దాడక.

ఉ. అరయనాలుగేఁడునెలలాయెఁగదా మనపట్టివిద్యలన్
నేరువనొజ్జలొద్దకును నిచ్చలపున్మదిపోయెనొంటిగా
నేరహినిల్చెనో చదువులెట్లుగ్రహించెనో మీనకేతునిన్
గేరుడు నాకుమారుఁ దిలకింపఁగ నాకుమనంబు గల్గెడిన్

హిరణ్యా—కామినీ! నాకునునట్లే చూడబుద్ధికలుగుచున్నది. వానిచూడకుండుటకు నాకేమిపగయా? ఇంటికి వచ్చుచుండినవానికి భయముకలుగదనియు, వానికిఁ పట్టువడినదుర్మతము మానదనియు, నూహించి గురుకులవాసమే యొనర్చి భోజన మజ్జనాదులకుసయితమందేయుండిన మేలుకలుగఁగలదని కదా వానిని శుక్రకుమారుల కప్పగించి యిన్నినాళ్ళుంటి? సేవకా! నీవీక్షణమునఁబోయి చండామార్కులను, నా కుమారునిఁ బిలుచుగొనిరమ్మని చెప్పుము.

సేవక—చిత్తము. (అని నిష్క్ర).

హిరణ్యా—ఆఱుమాసములకుముందే చక్కఁగ విద్యనేర్చియుండె. ఇప్పుడక్కడ నేయుండి నందున నింకను విద్యాధికుఁడైయుండును. ఆపేర పిలువరాని పలుగాకిని మాత్రము స్మరింపకయుండెనా యెంతయో విద్వాంసుఁడనిపించుకొనుచుండె. అదే యందెల చప్పుడు వినిపించుచున్నది. వచ్చుచున్నాఁడు కాఁబోలు.

[ప్రవేశము: చెండామార్కులు ప్రహ్లాదునితో ప్రక్కన]

చండుడు—

ఉ. "త్రిప్పకుమన్న మామతము దీర్ఘములైన త్రివర్గపాఠముల్
దప్పకుమన్న నేఁడుమన దైత్యవరేంద్రుని మ్రోలమేముము
న్జెప్పినపాఠముల్వదలి చెప్పకుమన్న విరోధిశాస్త్రముల్
విప్పకుమన్న దుష్టమగు విష్ణుచరిత్రకథార్థజాలముల్".

అయ్యా! ప్రహ్లాదా! నిన్ను వేడుకొందుము. మేము చెప్పినపాఠములన్నియుఁ జక్కఁగ వచింపుము. అడిగినమాటకుత్తరమిమ్ము. ఆవిష్ణుని ప్రస్తావనమాత్రము నీతండ్రి యెదుట నెత్తకుండ మమ్మనుగ్రహింపుమా!

హిరణ్యా—(ప్రహ్లాదుని సమీపించి యాలింగనముఁ జేసికొని పీఠముపైకిఁబోవును).

లీలా—(ప్రహ్లాదుని కౌఁగిలించి ముద్దాడును).

హిరణ్యా—(ప్రహ్లాదుని తనతొడపైఁ గూర్చుండఁబెట్టుకొని)

శా. చోద్యంబయ్యెడి నింతకాలమరిగెన్ శోధించియేమేమి సం
వేద్యాంశంబులు సెప్పిరో గురువులేజాడన్ పఠింపించిరో
విద్యాసారమెఱుంగఁగోరెద భవద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యంబొక్కటిసెప్పి సార్థముగఁదాత్పర్యంబు భాషింపుమా"

ప్రహ్లాద—

కం. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖర శాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లఁ జదివితిఁదండ్రీ

కం. కడివెడు పెరుగుఁజిలికి బ
ట్టెడు వెన్నన్ వెలికిదీయు కీవిని నేనె
క్కుడు వేద శాస్త్రములలోఁ
బడసితి సారంబు దనుజపాలక చంద్రా.

హిరణ్య—అయ్యా! చదువులలోని మర్మముఁ దెలిసితివా? నాకెంత సంతోషము. నీతోడి బాలురెల్ల మహానీతి విదులైయున్నారని విని నీకొఱకై యెంతో యెదురు చూచితి.

శా. నిన్నుం దా మెచ్చరు నీతిపారగరిమన్ నీతోడిదైత్యార్భకుల్
కన్నారన్నియుఁ జెప్పనేర్తురుగదా గ్రంథార్థముల్ దక్షులై
అన్నా యెన్నఁడు నీవు నీతిమతి వాదంచున్ మహావాంఛతో
నున్నాఁడన్నను గన్నతండ్రి భవదీయోత్కర్షమున్ జూపవే.

కుమారా! శాస్త్రములలో సారముఁ బడసితినంటివే? ఏది నీసారము?

ప్రహ్లాద—

కం. శారీరకాంతి విజితమసారము
భక్తానన్యైకచాతుర్యదయా
సారమఖిలభీకరభుజసారము
హరితత్త్వమొకటె సారమౌ తండ్రీ

హిరణ్య—(ఆశ్చర్యమునభినయించి) అయ్యా! కుమారకా ఇదియేమి చదువు? ఏమిసారము? ఆదురాత్ముఁడగు హరిని యేల స్మరించెదవు?

శా. నాకున్ జూడఁగ జోద్యమయ్యెడిఁగదా నాతండ్రి యీబుద్ధి తా
నీకున్ లోపలఁ దోచెనో పరులు దుర్నీతుల్ పఠింపించిరో
యేకాంతంబున భార్గవుల్ పలికిరో యీదానవశ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీకేటికిన్

ప్రహ్లాద—అయ్యా! అదియంతయు దైవాయత్తము. మాధవ మనోహరచరణములపై భక్తిమై నెలకొనియున్న మానసము దేవాంతర ప్రసక్తికిఁ బూనునే?

సీ. మందారమకరంద మాధుర్యమునఁ దేలు
మధుపంబు బోవునే మదనములకు
నిర్మలమందాకినీ వీచికలఁ దూఁగు
రాయంచ చనునె తరంగిణులకు

లలితరసాలపల్లవఖాదియై చోకుఁ-
గోయిలసేరునే కుటజములకు
పూర్ణేందుచంద్రికా స్ఫురితచకోరకం
బరుగునే సాంద్రనీహారములకు

తే. గీ. నంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృత పానవిశేషమత్త
చిత్తమేరీతి నితరులఁజేర నేర్చు
వినుతసద్గుణశీల, యోదనుజపాల

హిరణ్య—శుక్రకుమారులారా! ఇదియా మీరు చెప్పినచదువు?

చ. పటుతరనీతిశాస్త్రచయపారగుజేసెదనంచు బాలునిఁ
వటుగొనిపోయి వానికి ననర్హములైనవిరోధిశాస్త్రముల్
గుటిలతఁజెప్పినాడవు భృగుప్రవరుండవటంచునమ్మితిన్
గటకట బ్రాహ్మణాకృతివిగాక యథార్థపుబ్రాహ్మణుండవే

చండుడు—(చేతుల జోడించి).

ఉ. తప్పులులేవు మావలన దానవనాథ విరోధిశాస్త్రముల్
జెప్పము కూర్మిరులై పరులు జెప్పరు నీచరణంబులాన సు
మ్మెప్పుడు నీకుమారునకు నింతయునైజమనీష యెవ్వరున్
జెప్పెడిపాటిగాదు ప్రతిచింతఁ దలంపుమమాటలేటికిన్

కం. మిత్రులము పురోహితులము
పాత్రులమేమిదియుగాక భార్గవులమునీ
పుత్రునికటువలెఁ జెప్పఁగ
శత్రులమే మేముదైత్యచంద్రానీకున్

ప్రహ్లాద—అయ్యా! వారినేల కోపగించెదు? పూర్వజన్మసుకృత పరిపాకమునఁగాక హరి పూజా పుణ్యము లభించునా? అదియొకరు చెప్పినవచ్చునా?

ఉ. అచ్చపుఁజీఁకటిం బడి గృహవ్రతులై విషయప్రమత్తులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణులైనవారికిన్
జెచ్చెరఁ బుట్టునే పరులు సెప్పిననైన నిజేచ్ఛనైననే
మిచ్చిననైనఁ గానలకు నేగిననైన హరిప్రబోధముల్

హిరణ్య—దురాత్మా! నీవింకొకసారి వాని పేరెత్తిన నినుఁజంపివైచెద.

ప్రహ్లాద—తండ్రీ! ఆపేరెత్తవలయునన్న నాయత్నమా? ఎత్తకుండుటయు నాకుసాధ్యమా?

తే. గీ. అయ్య వినవయ్య నాహృదయంబునందె
కాదు నీయందు సకలలోకములయందు
నుండి విష్ణుండె యాయాప్రయోజనములఁ
దానె కావించునొకఁడె స్వతంత్రుడగుచు

హిరణ్య—కులనాశకా! నీకింత కావరమా? (అని కత్తినెత్తి ప్రహ్లాదుఁ గొట్టబోవ).

అనుబంధము. 19.

లీలా—(చేతులుపట్టుకొని) నాథా! నీవు కోపగించుట కీబాలుఁ డెంతటివాడు? పిచ్చికై బ్రహ్మాస్త్రమన్న విధానమగుఁగదా?

చండ—మహాప్రభువా! క్రోధముజ్జగింపుము.

కం. "నీపాపనిఁ జదివింతుము
నీపాదములాననింక నిపుణతతోడన్
గోపింతుము దండింతుము
కోపింపకుమయ్య దనుజకుంజరపట్టీ"

హిరణ్య—ఇంకచాలింపుడు. మీచదువులింకేమియు వలదు వెడలిపొండు.

చండ
అమర్క } చిత్తము. (నిష్క్రమి)

హిరణ్య—బాలకా! నీనీదుష్టమతము మానదువా లేదా?

సీ. "అస్మదీయంబగు నాదేశమునఁ గాని
మిక్కిలి రవిమింట మెఱయవెఱచు
నన్నికాలములందు ననుకూలుఁడై కాని
విచ్చలవిడి గాలి వీవవెరచు

మత్ప్రతాపానలమందీ కృతార్చియై
విద్వేషమున నగ్ని వెలుఁగ వెఱచు
నతితీక్ష్ణమైన నాయాజ్ఞనుల్లంఘించి
శమనుండు ప్రాణులఁ జంప వెఱచు
తే. గీ. నింద్రుఁడౌఁదల నామ్రోల నెత్త వెఱచు
నమరకిన్నర గంధర్వయక్షవిహగ
నాగవిద్యాధరావలి నాకు వెఱచు
నేల వెఱవవు పలువ నీ కెవరుదిక్కు"

హిరణ్య—ఎవఁడున్నాఁడురా నీకుదిక్కు?

ప్రహ్లాద—అయ్యా! నీవిట్లడుగ నేనేమని వచింతు?

తే. గీ. దిక్కెవ్వఁడు దుర్బలురకు
దిక్కెవ్వఁడు నీకు నాకుఁ ద్రిదిశాదులకున్
దిక్కెవ్వఁడు భూజనులకు
దిక్కెవ్వఁడు అతఁడు హరియే దిక్కగు తండ్రీ.

హిరణ్య—ఇంతయ్యు నీ దుష్టమతము మానవా? తరుణీ! యింక నేను సహింపజాలను కొడుకగుఁగాక, ఎవ్వఁడైన నగునేగాక నావిరోధిపక్షమవలంబించు వారి మననివ్వను ఒకగడియ వీనికవకాశమిచ్చితి. కొడుకే నీకుఁగావలయునన్నఁ జక్కగ నుపదేశ మొసర్చి దుష్టమార్గమునుండి త్రిప్పుము.

అనుబంధము 20

బ్రతికియే యుండవలయునని వీఁడిచ్ఛయించు నేని వీఁడును దుర్బుద్ధి వీడువాఁడు. నేఁనిదె మరలివచ్చెద. (నిష్క్రమి.)

లీలా—అనుఁగుపట్టి! చూచితివా జనకుఁడెంతకనలియున్నాఁడు? ఏల యాతనికిఁ గ్రోధము జనించుభంగి నాచరించెదవు? జనకాజ్ఞ యవశ్యము పాలింపఁదగినదికదా? కుమారా! తండ్రిని తిరస్కరించుట పాడిగాదు. అతఁడు దుష్టమార్గమన్న దానిని నీ వేల విడువరాదు?

ప్రహ్లాద—అమ్మా! లోకరక్షకుని జగదీశుని రమావల్లభుని స్తుతియొనర్చుట దుష్టకార్యమా?

లీలా—అయ్యా! దుష్టకార్యము కాదనియే యనుకొనుము. తండ్రికొరకైన వదిమానవచ్చుఁగదా?

ప్రహ్లాద—సత్యమే? నాయట్టిబాలుని మనసునకు సముచితము తరుణోపాయము గలిగించు సత్కార్యము దుష్కార్యమన్న దండ్రియైన నేమి, అది వినవచ్చునా? ఇందున బిత్రాజ్ఞోల్లంఘన, పాపము గలుగునా?

లీలా—అన్నా! పోనిమ్ము నీవు సత్కార్యమేయని యంటివిగదా? దాని విడువకున్న మానె నీమనసున నీవు నుతించుకొనుము. వెలికిఁ జెప్పి తండ్రిమనసున కేలయసంతృప్తి గలిగింపవలయు?

ప్రహ్లాద—అమ్మా! నాకేమి భయము? ఆశ్రీవల్లభుని పాదసేవ మనోవాక్కర్మములనే నొనర్పనుండ మనసునఁ దాచనేల?

లీలా—అయ్యో! కుమారా! నీతండ్రి నిను శిక్షింతు సంహరింతునని చెప్పలేదా? అట్టి క్రోధములకేల యవకాశమీవలయు?

ప్రహ్లాద—అమ్మరో! నీ వాడునది భ్రాంతికదా? ఈలోకమున నొకరు శిక్షించువారున్నారా? అన్నిశిక్షలకు మాధవుఁగడే గదా కర్త? అతని యాజ్ఞలేక నొకరి నొకరు శిక్షించువారలా?

లీలా—పుత్రా! నీకేమి గుణముపట్టువడిరొ? ఈయీడునకే నీకుఁగల దైవభక్తికిసంతసించవలయుటమాని, దానికిఁ గాఁగల ఫలమునకై దుఃఖింపవలసి వచ్చెగదా? మాయన్నా! విడువుమీమతము.

అనుబంధము 21

నీజనకుఁడు జగమునంతయు గెలిచి స్వాధీనమందుంచుకొని జగతీశుఁడును జగదీశుఁడును వలెనే యున్నాఁడు. అతని యెదుటఁ బ్రత్యుత్తరమిచ్చి యొకఁడు బ్రతుకఁగలడా? అతని కొకరడ్డము రాఁగలవారలా? పట్టీ! నామాటవినుము. ఎవరికొఱకు గాకున్న, నిన్నొక రంగులెమునఁ జెనకుటఁ జూడఁజాలని నాకొఱకైన నీపట్టుమానుము

ప్రహ్లాద—తల్లీ! ఈమాటనకుము. బ్రదుకుఁదెరువుపదేశింపఁగలనీవు నాకిట్లుపదేశము సేయఁజను నే? నీవేమైన నొనర్పమనుము, శిరసావహించి యొనర్చెద. హరిభజనమానుటమాత్రము నాచేతఁగానిపని. నీకునమస్కరింతు. నను మన్నింపుము.

(అని కాళ్ళఁబడును)

[పునః ప్రవేశము హిరణ్యకశిపుఁడు.]

హిరణ్య—ప్రియా! ఈకుమారుఁడు తనదుర్బుద్ధి వదలినట్లున్నదే? నినుమన్నింపఁగోరినట్లున్నదే! ఇప్పుడు సంతసించితిని (ప్రహ్లాదునెత్తికొని ముద్దాడి) కుమారా! నీవు మాయన్నవుగా నిన్నెంతెంతో శిక్షింపవలయునని యెంచియుంటినే? నీయసువుల హరింపఁదలఁచియుంటినే? కుమారా! ఇంకఁ జేయవుగా హరిభజనము?

ప్రహ్లాద—అయ్యా! ఆభజన మానుటనాకు సాధ్యమా? నాశరీరముతోడ బుట్టినదికదా నాకా విష్ణుభక్తి? నీవుగొప్పవాఁడవు. జగమునంతయు స్వాధీనమందుంచుకొన్న వాఁడవు. నాకుతండ్రివి. పూజనీయుఁడవు. నీమాట జవదాటక నే జరుపఁగోరుదు లేని హరిభజనము మాత్రము మానమనకుము.

హిరణ్య—ఓరీదురాత్మా! ఐన నీదుర్బుద్ధిమానవా? చూడుము. మరల నేఁద్రిప్పువాడను గాను. కొడుకని చూచువాడను గాను. చంపింతునంటినా చంపింపకఁ దప్పను. ఇంకా భజనము మనోవాక్క్రియములమానితినని నాచరణము లంటుము. కాకున్న నీవు చచ్చితి వనుకొనుము.

ప్రహ్లాద—అయ్యా! ననుఁజంపితివా మేలాయె. అందుకట్లయిన నొవ్వొకొందుఁగాక రమావల్లభు భజనమాత్రము నీవేమన్నను మానను. ఆకంజాక్షునకు నమస్కరింపని శరీర మొక్క శరీరమా? గాలినించిన తోలుతిత్తియగుఁగదా! ఆవనజలోచను నుతింపని నోరొక్క నోరా? ఇంతవాయించిన డమడమ వాగువాద్యమగుగదా? ఆశ్రీహరిని పూజించనిచేతులొక్కచేతులా? కట్టెఁగతిచెలుకదా! రమారమణుని చూడని కన్నులు కన్నులనవలయునా? దేహమను గోడయందుంచిన బెరుగండ్లనవలయుగాక

సీ. "కంజాక్షునకుఁగాని కాయంబుకాయమే
పవనగుంభితచర్మభస్త్రిగాక
వైకుంఠుఁబొగడని వదనంబువదనమే
ఢమఢమధ్వనితోటిఢక్కగాక
హరిపూజనములేని హస్తంబుహస్తమే
తరుశాఖనిర్మితదర్విగాక
కమలేశుఁజూడని కన్నులుకన్నులే
తనుకుడ్యజాలరంధ్రములుగాక
తే. గీ. చక్రిచింతలేని జన్మంబుజన్మమే
తరళసలిలబుద్బుదంబుగాక
విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుడే
పాదయుగముతోడి పశువుగాక"

హిరణ్య—దురాత్మా! మాయుమింకనోరు. ఇంతకావరమా? నాకెదురుగ మాటలాడెదవే. అయిన నీవాపాపాత్ముని స్తోత్రముచేయుట మానవు? మాటికి మున్మాటికి వచించెద. వదలవా? వదలవా? వదలవా?

అనుబంధము 22

నిను నిక్కముగా సంహరింతు. నాయానసంహరింతు.

ప్రహ్లాద—అయ్యా! ఏలయీమాటలు? లోకములనెల్ల పుట్టింపఁ, బెంప, సంహరింప వైకుంఠుడొకడు కర్తగాక నేనుసంహరించెదనని యొకరు చెప్పుటకుసాధ్యమా? చావు రావలసినవేళ నెవరడ్డము వచ్చినను వచ్చును. రాగూడనివేళ నెందఱు సంహరింప నెంచినను రాదు.

హిరణ్య—అగుము. వాగకుము. చెప్పుమొక కడమాట?

ప్రహ్లాద—ఇదియే నాకడమాట. త్రికాలములయందునుఁ ద్రికరణములయందును నిష్ఠాచింత నమే నాతరుణోపాయము.

హిరణ్య—కానిమ్ము దురాత్మా! ఓరీసేవకా!

[ప్రవేశము: సేవకుఁడు]

నీవీక్షణమున యీపాపాత్ముని గొనిపోయి కాలనాభాదిరాక్షసుల కొప్పగింపుము. వారితో నాయాజ్ఞవచింపుము. ఆపశ్చిమభాగమున దూరముననున్న యున్నతశైలము నకు వీనిఁగొనిపోయి శిఖరముననుండి క్రిందికిఁ బడుసటుల దొరలింపనాజ్ఞ యిచ్చినాని చెప్పుము. నానందనుఁడనియు, సుకుమారుఁడనియు దలంపకుమనుము.

(అని ప్రహ్లాదునిఁ ద్రోయును).

సేవకు—(ప్రహ్లాదుని నీడ్చుకొని నిష్క్ర).

లీలా—హా! నాథా! (అని చరణములపైఁ బడును).

హిరణ్య—భామామణీ! ఇంక నాకక్షిమీఱినది. అట్టిదుష్పుత్రుడుండుటకంటె, లేకుం డుటే మేలు లెమ్ము లెమ్ము. (అని లేవనెత్తుచుండ).

(యవనిక దిగఁజాఱును.)

—(తృతీయాఙ్కము సమాప్తము)—

———:O:———

శ్రీ

# ప్రహ్లాద నాటకము.

## చతుర్థాఙ్కము-ప్రథమరంగము.

### పర్వత భూమి.

[ప్ర: కాలనాభుఁడు, వజ్రదండుఁడు. ప్రహ్లాదునితోఁబర్వతశిఖరమున].

కాలనాభ—ఓరీ! పితృద్రోహీ. ఇదేమాకాజ్ఞయైయున్నది ఎఱుఁగుదువుగదా? ఇప్పుడైనను నీవాదుష్టచింత మానెదవనిన మాటయిచ్చితివా జగదీశునొద్దకుఁబోయి మేము మన్నింపవేఁడుకొందుము. ఏమందువు?

అనుబంధము 23

ప్రహ్లాద—నేనేమందును. కృష్ణాయందును. నారాయణాయందును. కానిండు. మీయాజ్ఞ నిర్వహింపుఁడు.

కాల—(వజ్రదండునితో ఏకాంతమున) ఓరీ! వీనికినిద్ర వేళవచ్చినది. నిద్రపోయినప్పుడు చరుపాత మొనర్చిపోదము.

వజ్ర—అవును. అదియే మేలు.

ప్రహ్లాద—(పాటపాడుచుఁ బండుకొనును)

అనుబంధము 24

కాల—వజ్రదండా! నిద్రబోయినట్లున్నది. ఇంకమనపనిఁజేయుందమా?

వజ్ర—(ప్రహ్లాదునిఁజూచి) కాలనాభా! ఇంకను నిద్రపట్టినట్టులేదు. కొంచెము తాళుదము. (ఇరువురు కొంచెముసేపునిలిచి ప్రహ్లాదునెత్తి యట్టెక్రింద వేయుదురు. శబ్దముతో ప్రహ్లాదుఁడు క్రిందబడును. ఒక ఘటికాలమున తెరక్రిందికిపడిలేచును).

ప్రహ్లాద—(ముందటికి పాటపాఁడుచు వచ్చును).

[ప్రవేశము: నారదుఁడు]

అనుబంధము 25

నారద—భళీ! కుమారా! నీవు కడుధన్యుఁడవు. ఆవిష్ణునను గ్రహము నీకుపరిపూర్ణము గాఁగలదు. ఉన్నతశైల శిఖరమునుండి పాతమొనర్చియు నించుకైనఁ గందకుండ యున్నాఁడవే?

ప్రహ్లాద—మహాత్మా! నమస్కరించెద. నీవెవ్వరవో నెఱుఁగను విన నీవీణాగానము వినగా, నీవును హరిభక్తిశిఖామణివని తెలియవచ్చెఁగాని నీధ్వనిమాత్ర మెందో కలలో వినినట్లున్నది.

నారద—కుమారా! నేనారదుఁడను.

ప్రహ్లాద—ఆహా! నీవా నారదుఁడవా? (నమస్కరించి) సాధారణముగా మానవులకంటి కగోచరుఁడవైన నిన్నుఁ గనుఁగొను మహాపుణ్యమెవరికి లభింపఁగలదు? మహాత్మా! నను ధన్యుఁజేయఁగదా నీవిందే తెంచుట

నారద—కుమారా! నిన్నుఁగాంచుటచే నాకును ధన్యతసిద్ధించె. హరిభక్తులను మము బోంట్లెల్లనీవు వెలుఁగుబెట్టుటకైన నర్హులముకాఁజాలము. ఇదియంతయు నీపూర్వజన్మ సుకృతఫలము. ఎవరుమాన్పినను నీకా రమేశుమీద భక్తిమానఁజాలదు. దృఢభావమున నీవతనిని నమ్మితివా యేకీడును రాదు.

సీ. ఓబాలహరిభక్తయోగి నిన్నుఁజూడనా
స్వాంతంబునను నిండెసంతసంబు
బరికింపఁగాఁబూర్వ భవపుణ్యఫలమున
గాకింతఘనభక్తి గలుగఁగలదె
యీయీడునకెయున్న యీభక్తియెవరెం
తమాన్పఁబూనిననైన మానగలదె
వైష్ణవాగ్రణులలో వరమణివై యీడులే
కున్నవాఁడవేయో కుమార

తే. గీ. వసుధ ననుఁబోలు భక్తులెవ్వారుగాని
తెలియ నీప్రాభవమునకు దివియపట్టఁ
జాలువారెమె యెన్నిచందాలనైన
వేదహితపాదలోల ప్రహ్లాదబాల.

నినుఁజూచుటకే నేవచ్చితి. ఇఁక నేఁబోయివచ్చెద.

ప్రహ్లాద—మునికులతిలకా! ఎంతప్రాణముపైవచ్చినను హరిభజనము మానని పుణ్యము నాకుఁగలదుగదా?

నారద—(ప్రహ్లాదు నాలింగనముఁజేసి) బాలభక్తాగ్రేసరా! నీవేమియు యోచింపకుము. ఈభక్తి నీకెన్నఁటికినితప్పదు. ఎవరెంత కీడొనర్చినను నిన్నేమియుబాధింపఁజాలదు.

—o—

## చతుర్థాఙ్కము-ద్వితీయరంగము.

———:o:———

### హిరణ్యకశిపునగరు.

[లీలావతి మూర్ఛిల్లియుండును ప్రక్కనహిరణ్యకశిపుఁడు.]

హిరణ్య—తరుణీమణీ! ఏమిచింతించి యేమిప్రయోజనము? ఇదియత్నముతేనిపని. ఊరక శోకముమానుము.

లీలా—నాథా! బాలుఁడనియైన నించుకంత కరుణింపకఁ బోయితివే? ఎట్టిదుష్కృతములవడినను సుతని శిక్షింపవలయుఁ జక్కనిమార్గమునకుఁ దేవలయుఁగాక, చంపఁబంపుదురే? అయ్యో! ఈవఱకు నాకుమారుఁడేమైయున్నాఁడో? వానివియోగదుఃఖము భరియించి నేమనఁగలనా?

సీ. రక్కసుల్బడఁద్రోయ రక్షింపరావె
మాతల్లియనుచు నన్నుఁదలచనేమొ
పైనుండిపడఁబోవు వడిదిక్కుతోఁపక
యమ్మా యనుచుఁజాల నఱచనేమొ
మిగులనేరములేక తెగటార్చెఁదండ్రి
బలాత్కారిరుఁడనుచు నాడికొనియెనేమొ
తండ్రిచంపఁగబంపఁ దానడ్డపడదయ్యెఁ
దల్లియంచని తల్లడిల్లెనేమొ

తే. గీ. యెట్లులున్నాఁడొ యేమయినాఁడొ నా
కకటవానిముద్దు మొకముఁజూచు
భాగ్యమింకలేదో పాపనినేనెందు
వెదకుదాననెట్లు బ్రతుకుదాన.

ప్రాణేశా! మన్నింపుము. నీసుతునిఁ బిలిపింపుము. నీకులాభరణమును.

హిరణ్య—తన్వీ! ఇదియేమిభ్రాంతినీకు? వాఁడొకకొడుకని నీవుభావించెదవా? నందనవనమున విషవృక్షము పుట్టినట్లు బుట్టినాఁడే? యింతయవిధేయుఁడు బ్రతికిన నాకీర్తి యంతయుఁ బాసిపోవదా?

[ప్రవేశము: కాలనాభుఁడు]

కాల—దేవా! మీయాజ్ఞతెఱంగున మీకొమారుని శైలశిఖరముపైఁగొనిపోయి యం దుండి యావైపునున్న యగాధబిలమునఁ ద్రోసివచ్చితిమి.

హిరణ్య / లీలా } హా! కుమారా! (యనిమూర్ఛిల్లుదురు.)

అనుబంధము 26

లీలా—అయ్యో! పుత్రా! ఈయేడేండ్లుమాత్రము పెంచుటయే నాకుఫలమా? నీకాపాడు హరిభజన మెట్లులవడియె? నీజనకునికి నీవేల శాత్రవుఁడవైతివి? అయ్యో! తనయా! అంతయెత్తునుండి నీవగాధకూపమునఁబడునప్పు డమ్మాయని నన్నెంత తలఁచితివో! ఎట్లు భరించితివో. అయ్యయ్యో! నేనెట్లుసహింతును? నాథా! నీకించుకైన కరుణ లేదయ్యెనే? కన్నకుమారు వధింపఁబాల్పడితివే?

హిరణ్య—హా! కుమారా! నినుబాసి నేనెట్లు జీవింతు? ననుతిరస్కరించుబుద్ధి నీకేలకలిగె? ఏలయామురాత్ముని స్మరించుట మానవైతివి? నీపాటలయర్థమునకుఁ గంటగించినను నీముద్దుపాటల మరల మరల వినగోరు యభిలాష జనించుచుండెనే. నేనింకెవ్వరిపాటల వినఁగలను? హా! ప్రహ్లాదా (అనిగట్టిగ నఱచును).

(లోపలధ్వని "అయ్యా ఇదేవచ్చితి" నని)

హిరణ్య—సాధ్వీ! ఏమాశ్చర్యమిది? మనకుమారునిధ్వని విన్పట్టాయె? నాకేమైనను భ్రమయా! లేక నీకునునట్లేవినఁబడెనా?

లీలా—నాథా! నాకును నిక్కముగా వినఁబడియె.

[ప్రవేశము: ప్రహ్లాదుఁడు పాడుకొనుచు.].

అనుబాధము 27

లీలా—(పోయి గట్టిగా నాలింగనము చేసుకొనును)

హిరణ్య—(కొంతసేపు దిగ్భ్రమము నభినయించి తర్వాత పోయి ప్రహ్లాదునెత్తుకొని ముద్దాడి) నాతనుజా! మరల నాయొద్దకువచ్చితివా? ఇంక నీదుర్వర్తము మానితివి గదా? అయ్యో! క్రూరాత్ముఁడనైన నేను నీకు శైలపాతశిక్ష విధించితినేయని నీ కాగ్రహము కలుగదుగదా? అయ్యో! నీవెట్లువచ్చితివి? ఆకూపమునుండి యెట్లు తప్పించుకొంటివి? మహోన్నతస్థానమునుండి క్రిందఁబడుట కెట్లోర్చితివి? నీవేతప్పి వచ్చితివా లేక నాచారులే నినుఁద్రోయలేదా?

ప్రహ్లాద—అయ్యా! నీచారులు నన్ను కూపమునఁ ద్రోసెదమనిరి ఎంతసేపుచూచినను ద్రోయరైరి. ఆశైలశిఖరముపై నిద్రించితి. ఇంతకు కొంతముందు నిద్రనుండి లేచితి చూచెదకదా! ఎట్లో యీపర్వతముక్రిందికి వచ్చియుంటి. వారేత్రోసిరో, నేనేపడితినో నేనెఱుంగ? ఇట్లేవచ్చితి.

హిరణ్య—కుమారా! మిక్కిలి సంతసించితిని. నాభాగ్యవిశేషమునగదా నీవుమరలి వచ్చితివి. ఇంకపోయినదిపోవనిమ్ము. నీవుపట్టువడియున్న దుష్టమతము మానుము. ఆకలుషాత్ముని పేరింక నుడువకుము మాతమ్ముని జంపిన పాపాత్ముఁడుగదా వాఁడు?

ప్రహ్లాద—జనకా! తననామస్మరణచే యెల్లవారికలుషములు క్షాళనము సేయనున్న ప్రభావముగల యాయిందరావల్లభుని నీవుకలుషాత్ముడంటివే? ఇందుకు నేనెట్లోర్తును.

హిరణ్య—ఛీ-దురాత్మా! మరల నీమాటచెప్పుటకా నీవువచ్చితివి? కలుషమతులగు నాభటులు నేచెప్పినయాజ్ఞ నిర్వహింపక నినుశైలనుండిఁ బడఁద్రోయక స్వామిద్రోహ మొనర్చియున్నారు కాబోలు? వారికిదగిన శిక్షయొసంగెద. అట్లుగాకున్న నీవు ప్రాణములతో నిటువచ్చియుందువా? ఓరీ సేవకా!

[ప్రవేశము: సేవకుఁడు.]

నీవీక్షణమునఁబోయి మంత్రిసత్తముని విప్రజిత్తునిఁ దోడికొనిరమ్ము.

సేవక—చిత్తము. (సేవకుఁడు నిష్క్ర-)

హిరణ్య—లీలావతీ! చూచితివా యీదురాత్ముని కండక్రొవ్వు? ఇప్పుడు వీఁడాడిన మాట యింకొకసారియాడిన నేవీనిఁ జంపింపకవిడువను.

[పునః ప్రవేశము: సేవకుఁడు]

సేవక—దేవా! ఆచార్యులవారువిచ్చేసియున్నారు. మీమంత్రిసత్తముఁడు నిప్పుడే వచ్చెదనని నుడివె.

[ప్రవేశము: శుక్రాచార్యులు]

శుక్ర—హిరణ్యకశిపూ! నీకుమారుని శైలమునుండి పడఁద్రోయించితివఁట. అదివిని నామనసున కళవళముఁ జెందె. నీభటుఁడగు కాలనాభుఁడును నీకుమారుని శైలమునుండి యగాధకూపమునఁ ద్రోసినది నిక్కమనివచించె. నీతోమాటలాడ వచ్చుచుండ దారిలో నీకుమారుఁడు బ్రతికివచ్చియున్నాఁడని తెలిసె. ఏమాశ్చర్యమిది?

హిరణ్య—బ్రతికివచ్చియున్నాఁడనియే దుఃఖించుచున్నాను. ఈకులనాశకుఁడు చచ్చియున్న నాకింత దుఃఖముండదుకదా? గురువర్యా! మీరును చూచితిరిగదా చిన్నప్పటినుండి వీనికి హరిస్మరణయను దుర్మతమెట్లో పట్టువడియున్నది. ఎంతచెప్పినను ప్రాణలోప్పఁ జెప్పనుగాక, నదిమాత్రము మాననను చున్నాఁడు. ఎట్లునువీఁడు చావవలసినవాఁడేయగు. ఏదోయొక్క విధానమునఁ జంపించెద.

శుక్ర—కుమారా! బాలునిమ్రందజేయుటపాడియా? ఎట్టివిధానము పట్టువడినను, నెట్లో యొకమార్గమునఁ ద్రిప్పఁజూడవలయుఁగాక చంపునంత పగసాధింపఁగూడునా?

హిరణ్య—అయ్యో! గురూత్తమా నాకేమిపగయా? నీవెఱుఁగవే? ఈరేడులోకముల నాయాజ్ఞనిర్వహింపనివాఁడొకడున్నాఁడా? ఈబాలుని యహంకృతికి నేనోర్వఁ గలనా? మీరెవరైననుద్బోధించి వానిమతము విడిపించితిరా ధన్యుఁడనయ్యెదఁగదా?

శుక్ర—లీలావతీదేవీ! నీవైననుద్బోధింపఁబోయితివా?

లీలా—ఆచార్యసత్తమా! నేను నెంతెంతో బోధించితి. ఎట్లును త్రిప్పఁజాలకున్నాను. నాథుని యాగ్రహముఁజూడఁజాలకున్నాను. మీరైన నుద్బోధించి నానాథుని యభీష్టముఁ జెల్లింతురా?

శుక్ర—చూడుమింకొకసారి వానికిఁ జెప్పి?

హిరణ్య—గురువర్యా! నేనిదియొక కార్యమునకై పోవలయు. నామంత్రియు రాఁడయ్యె. ఇప్పుడెవచ్చెద. ఇంతలో నీకష్టాత్ముని దుష్టమతము వారింప నుద్బోధింపుఁడు.

(నిష్క్ర-).

శుక్ర—లీలావతీదేవీ! నీవుబోధింపుము. నేనునువిందు.

లీల—(ప్రహ్లాదుని కౌగిలించి) అన్నా! నేనెన్నిమారులో వచించితినే. తండ్రిమనస్సునకు వెగటగుకార్యముజరుపవలదని వినకున్నావే? నేనేమిసేయుదును? అయ్యో! నీకంత భక్తియున్న వెలికిఁజెప్పికొనక మదిలోననే యుంచుకొమ్మని సహితము చెప్పితినే? కుమారా! నీవుపెద్దవాఁడవై యుక్తాయుక్త పరిజ్ఞానము గలిగినపిదప నీయిచ్చవచ్చినట్టులాచరింతువుగాక, ఇప్పుడుమాత్రము నామాటఁజలుపుమా?

సీ. అన్నరోమదినెంత హరిభక్తియుండిన
నినుపార వెలికిరానీయకయ్యా
తనుఁగాంచిపెంచిన తండ్రియాడిన
మాటపాటింపకుండుట పాపమయ్యా
తనమాటవినకున్నఁ దప్పకనీతండ్రి
తెంపుమై నినుఁజంపఁబంపునయ్యా
విభుఁడైన తండ్రియే వెసఁ జంపనెంచిన
లాఁతులింకెవరునిన్బ్రోతురయ్యా

తే. గీ. వంతలీవొందనెట్లు భరింతునయ్యా
నీకుఁగీడైన నాకెంతశోకమయ్యా
ఈవుగాకనన్బ్రోచు వారెవ్వరయ్యా
లీలనామాటలిప్పుడాలింపుమయ్యా.

అయ్యో! నీకు శైలపతన విధికలిగినందున కింతవఱకు నేనెంత దుఃఖించితినో, యాదైవమే యెఱుంగు. నాభాగ్యవిశేషమున నెట్లో తప్పివచ్చితివి. ఇంకనుడుగుమా నీయాచరణము? చిన్నికుమారా! నీజనకుఁడు పట్టినపట్టుసాధింపక మానఁడు. నీవతనిమాట వినకున్న నినుఁజంపకమానఁడు. నిష్కారణముగ మృతిగలిగించు కొందువేని దీని కెట్లోర్తును?

శుక్ర—చూచితివే బాలకా! నీతల్లిమాటలయందెంతయుక్తి యున్నది పుత్రతకుఫలము జనకవాక్యపరిపాలనమేకదా? నిరంకుశాధికారముగల నీజనకుఁడు నీవుమాటతప్పిన నోర్వఁడు. నినుసంహరింపకమానఁడు. ఊరక వాగ్ధోమమున సంహరింపఁబడుట వివేకమతమగునా?

ప్రహ్లాద—గురువర్యా! మాతా! మీమాటలకు నేనచ్చెరువొందితి. ఎన్నిధర్మములో తెలిపినవారలు మీరింత ధర్మసూక్ష్మము నెఱుఁగకుందురా? చంపవలయునన్న, పాలింపవలయునన్న, నందుకు జగదీశుఁడగు శ్రీవల్లభుఁడు కర్తగాక నితరులకు సాధ్యమా? ఒకరినొకరు చంపువారలా? చంపనే చంపిరనుకొనుఁడు. అందుకేలరోయాచింపవలయు? శరీరముధరించి పుట్టిన మానవునికి చావెంతనిక్కమో బ్రతుకంతనిక్కముకాదుగదా? చావు తప్పనది. స్థిరమైనది. బ్రతుకు సంశయమైనది. అస్థిరమైనది. ఇట్లుండఁ జావునకు వెనుదీయవలయునా నూరేడులకు చచ్చునాఁడు నిప్పుడే చచ్చెదఁగాక భవతారకమై, యానందజనకమై, యప్రతిమానమైయున్న, శ్రీహరిస్మరణ నేమానుదునా? ఇంక నాకుఁ జెప్పకుఁడు. ఇదికానిపని. బ్రతికియున్నను, హరినన్నురక్షించువాఁడు. చచ్చిన నతఁడే ననురక్షించువాఁడు. మానను. మానను. అదిగో! అశ్రీహరి దివ్యమంగళ విగ్రహము ఎందుబోయినను నాకన్నుల కగపడుటమానదు. అదె! యాయిందిరావల్లభుఁ డందున్నవాఁడు. ఇందున్నవాఁడు. ఎందునున్నవాఁడు.

శుక్ర—(స్వ) ఆహా! ఈకుమారున కెంతదృఢభక్తి. వీనితండ్రికెంతదృఢవైరము? నాకుఁ జూడఁ బుత్రునకు తండ్రిమృత్యువో? తండ్రికిపుత్రుఁడే మృత్యువో? యెఱుఁగరాకున్నది.

[పునః ప్రవేశము: హిరణ్యకశిపుఁడు.]

హిరణ్య—ఆచార్యా! సతీమణీ! ఎంతవరకు వచ్చియున్నది.

శుక్ర—(స్వ) కంఠమువఱకు వచ్చియున్నది. తలమున్క లొకటియేతక్కువ.

హిరణ్య—ఏమి యూరకుంటిరి? ఈదురాత్ముఁడు తనమతమును మానఁడా? ఆహా! మీమౌనమువలననే యెఱుఁగనయ్యె. విప్రజిత్తూ—

[ప్రవేశము: దూరమున విప్రజిత్తు]

విప్ర—మహాస్వామీ!

హిరణ్య—మంత్రీంద్రా! నేఁజెప్పితిఁగదా యీకుమారుని పాపపుపట్టువల? వీని నింక జంపుటకై యెవరికైన నేర్పరుపుము. మండుచున్న యగ్నిలోవైచి చంపుమనుము. సముద్రమునముంచి గుండ్లుపై నెత్తుమనుము కాలవ్యాళముల గప్పించి కఱపించి చంపుమనుము రాళ్లురువ్వించి, యేవిధానమునైన సంహరించి, యాసంతోషవార్తనాకెఱింగించి, నాతో బహుమతిఁగైకొనుమనుము. కొనిపొమ్ము చండాలుని?

(కాలదన్నును)

అనుబంధము 28

శుక్ర—దైతేయచంద్రా! నామాట యింతటిసాటింపుము. నాకుమారులిదివఱకు వాని పఠింపించి యున్నారుగదా? నేనొక్కింత విద్యఁగఱపెద. తప్పక బుద్ధిమంతునిఁ గావించెద. నెలదినములలో నీయొద్దకు దెంచి యిప్పటిప్రహ్లాదునికిని యప్పటిప్రహ్లాదునికినిఁ గల భేదము నీవే యెఱింగునట్లొనర్చెద. ఇప్పటికి కోపముపసంహరింపుము.

హిరణ్య—గురుపుంగవా! నీమాటకు మాఱాడువాఁడనా? ఎట్లయిన వీనిబుద్ధి ద్రిప్పిన నాకత్యంత సంతోషము జనించుగదా? అవశ్యము కొనిపొమ్ము. విప్రజిత్తూ! మా యాచార్యుఁడు తానింత ప్రయత్నముఁ జేసెదనని వచియించియున్నాఁడు. నెలదినములగడువుకోరియున్నాఁడు. ఇదియేమాట. ఇంకొకసారి నాయొద్దకీకుమారునిఁ దేవలయునన్నఁ బరిత్యక్తహరిస్మరణునిగాఁ దేవలయు, లేదా సంహరింపవలయు. ఇంకొకసారి యాజ్ఞవలదు. గురువులవారియింట వీడెట్లు నడుచుకొనుటయు విచారించుకొనుచుండుము. వీనిబుద్ధి తిరుగకపోయెనా, నేఁజెప్పినవిధానము నన్నింకొకసారి యడుగకయే చంపఁబంపుము. శైలపాత మొనర్చియు బ్రదికివచ్చిన యీదురాత్ముఁడింకెట్లుతప్పించుకొనునో చూచెద? (శుక్ర-ప్రహ్లాద—నిష్క్ర-౨)

లీలా—నాథా! నేను హతభాగ్యరాలను. ఇట్టికుమారునిఁగనియు వాఁడులేకుండనొనర్చుకొనువిధి ఘటింపనున్నది. వాఁడు వానిమతము నించుకైనను ద్రిప్పడని నాకు దోఁచుచున్నది. అయ్యో! పరమాద్భుతసుధీసముపేతుఁడగు నాముద్దుకుమారుఁడు నాకు లేకుండెడుగా? నీవైనఁగరుణించి వానియిచ్చచొప్పున వానిఁ బోనివ్వరాదా?

హిరణ్య—మానవతీమణీ! ఇదిసరియైన మార్గమగునా? నాకొడుకువలననే నాకిట్టితిరస్కారముకలుగఁగూడునా? చూచినవారేమందురు? తనకొడుకునే యాజ్ఞలోనుంచుకొనఁజాలనివానియాజ్ఞ నింకెవరు నిర్వహింతురు? అదిగాక నాకాజన్మశత్రువగువాని నాయెదుటనే ప్రశంసించుచుండ జూచి నేనోర్వఁగలనా?

శా. అంగవ్రాతములోఁజికిత్సకుఁడు దుష్టాంగంబుఖండిచి శే
షాంగశ్రేణికి రక్షసేయుక్రియ నీయజ్ఞంగులద్రోహిను
స్సంగుంగేశవపక్షిపాతి నధముంజంపించి నీరవ్రంశో
త్తుంగఖ్యాతిఁజరించదం గులము నిర్దోషంబుగావించెదన్ .

(లీలావతి దుఃఖముతో నిష్క్ర.)

సేవక—దైతేయచంద్రా! నారదఋషులు వచ్చియున్నారు.

## అనుబంధము 29

(హిరణ్యకశిపుఁడు లేచిపోయి నారదఋషినిఁ బిలుచుకొనివచ్చి నమస్కరించి కూర్చుండఁజేయును).

నారద—హిరణ్యకశిపూ! ఏమిమిక్కిలిచింత తోనున్నట్లున్నది?

హిరణ్య—సంయమీంద్రా! నేనేమనివచింతును? నీయట్టివాఁడు సహితము చిరకాలము నుండియున్న నారాయణ స్మరణమాని నాపైఁగల యభిమానమున నాస్మరణచేయు చుందువే? ఇట్లుండ నాకొడుకునకు నెవరుగఱపియున్నారో నారాయణస్మరణ వ్యాధిజనియించియున్నది. ఎంతచెప్పినను, నెవరుచెప్పినను వినఁడు. అయ్యో! నారదా అదురాత్ముఁడగు నింద్రుఁడు నాసతీమణినిఁ జెఱవట్టుకొనిపోవుచుండనీవు విడిపించి నాకెంతయు నపకారమొనర్చితివి. నాసతికిఁ గలిగిన శిశువుఁబుట్టినవెంటనే ఖండించు నుద్దేశమున చెఱవట్టితినని వాఁడు నీతోఁజెప్పడా? అట్లైఖండించియైన నున్న నాకెంతో సంతోషముగానుండెడి. నాకున్న పీడ మీకు చుండెఁగదా?

నారద—అట్లనా? నీకంత దుస్సాధ్యముగానున్నడా చిన్నపాపడు? వాఁడునిన్నంత తిరస్కరించువాఁడా? నాకాశ్చర్యముజనించె. అట్టివానిమాత్రము మననీయరాదు. మననిచ్చిన నీయశమునకే కళంకము పెట్టినట్లగు. నీతమ్ముని జంపిన మహావిరోధిని నీచిన్నబాలుఁడు నీయెదుటనే నుతించునది విని యోర్చుటకు సాధ్యమగునా? అట్టి యహంకార బుద్ధిమాత్రము పెరుగనియ్యరాదు. తుదకువాఁడుపోయిననేమి? మీరిఱువురుఁ జల్లగనున్న, నెందఱట్టి కుమారులు గల్గరు?

హిరణ్య—శబాస్. నారదా! నీవు నిష్పక్షపాతివి. నీకున్న గుణము మఱియొక్కరికిఁ గలుగదు. నారదా! భోజనమునకు వేళయాయె దయచేయుఁడు. (నిష్క్ర.)

(నారద—"గోవింద దామోదర"పాటపాడుచు—(నిష్క్ర.)

———:o:———

## చతుర్థాంకము-తృతీయరంగము.

---

### పాఠశాల.

[ప్ర: బాలురు, ప్రహ్లాదుఁడు, శుక్రుఁడు, చండుఁడు, అమర్కుఁడు.]

శుక్ర—ప్రహ్లాదకుమారా! మీతండ్రితో నేఁజేసియున్న నెలదినములగడువు మీఱఁ జొచ్చె. ఈనెలదినములు నుత్తమోత్తములగు పాఠముల నీకుగ్గడించితి. వానియర్థము మఱవవుగదా? రేఁపు నీతండ్రియొద్దకుఁ బోవుదమా?

ప్రహ్లాద—అవశ్యముగాఁ బోవుదము

శుక్ర—ఇప్పుడు బుద్ధిమంతుఁడవు. పోయినప్పుడు నేఁజెప్పిన పాఠములనుమాత్రమువల్లిం మీతండ్రికేవగలుగు విషయమెన్నఁటికి నుగ్గడింపకుము. ఈదినము సంతోష పూర్వకముగా మాయింట పండుగఁ గావింపబడియున్నది. పక్వాన్న భోజనమొనర్చి, రేపు మీయయ్యయొద్దకుఁ బోవుదము. బాలకులారా! మీరెల్లరు నేఁడు మాయింటనే భుజింపవలయును. మేము స్నానమునకు వెడలెదము. మీరింకింతసేపు మీపాఠముల వల్లించిపోయి స్నానమొనర్చిరండు. (శుక్ర, చండ, అమర్క నిష్క్రాంతి).

1వ బాలకుఁడు—ప్రహ్లాదా! ఏమి మనయాచార్యులవారేమేమో చెప్పుచున్నారే? ఎల్ల శాస్త్రముల చెప్పుటకుముందే నేర్చికొను నీకు వారింత చెప్పవలయునా?

ప్రహ్లాద—బాలకులారా! ఏమో మనగురుఁవు చెప్పుచున్నాఁడని నేనూఁకొట్టెదగాక, మాగురువులవారు చెప్పుమార్గము ఋజుమార్గము కానేకాదు.

2వ బాలకుఁడు—అట్లనా? ఏమివిచిత్రమువింటిమి? అదిఋజుమార్గముఁగాకున్న నింకేది ఋజుమార్గము? అదినీకెట్లుదెలిసె? ఏదీ నీనోటనింత విననగోరెదను?

ప్రహ్లాద—ఇట్లడుగుఁడు. మీరునుయోచింపుఁడు. మనప్రాయపు బాలురీనెలదినములలో నెందఱో గతించిరిగదా? వారేలగతింపవలయు మనమేలజీవించియుండవలయు? వారి శరీరము లెక్కడబోయె? అవి మొదట వారికెట్లుకలిగియుండెను? ఇవి యించుక యోచింతురేని కర్మానుగుణముననగాక దీని కింకొక కారణముండునే? శరీరమువలన ప్రయోజనముండునే? యన్న, నొక్కింత ప్రాణముపోయిన వెంటనే కుళ్లి దుర్గంధముపుట్టి పురుగులుపడి నశింపదా? దానిఁగాల్చెదరు. పూడ్చెదరు. పక్షిసంఘముల కాహారముగా నొనర్చెదరు. కావున శరీరము ముఖ్యముకాదుగదా? ఆశరీరములోనున్న యింకొక పదార్థముగదా దానిస్వాధీనమందుంచుకొని యుండునది. ఆపదార్థమేది? అదియే జీవుఁడు—ఆత్మ—ధ్వని మనచెవులవిందుము. పదార్థముల మనకన్నులఁజూతుము.

కన్నులు చూచునా? చెవులువినునా; జీవాత్మగదా కన్నుల మార్గమునఁ జూచుట చెవులమార్గమునవినుట? జీవాత్మలేని శరీరము నిలువఁజాలదుగాని, శరీరము లేని జీవాత్మ నాశనమొందదు. అట్లు నాశనమొందకున్న నెక్కడపోవును? పుణ్య పాపముల ఫలమనుభవించి వెంటవచ్చిన కర్మకొలది మరల శరీరాంతరముఁ గ్రహించును. అదియేపుట్టుక. అందున కొన్నాళ్ళుండి మరల నశించును. ఇట్లేపుట్టుచు-చచ్చుచు. చచ్చుచు-పుట్టుచు. నెడతెగకుండును. అజీవాత్మ మరల పుట్టకుండుటకు నుపాయములేదా! అదియేతరుణోపాయము. అదిదేనివలన లభించును! ఊరకశాస్త్రముల వలనఁ బ్రయోజనమేమి "వర్ణచ్ఛేదనపూర్వయోః" అని చదివితిమిగదా! ఆధాతువలన నెన్నిశబ్దములు బుట్టిన మనకేమి ప్రయోజనము కలుగు! అట్టి చదువులెన్ని చదివిన నాత్మ తారకములుగావు. మనవారు గృహస్తమార్గము నవలంబించి సంసారక్లేశముల జిక్కి చచ్చుచు పుట్టుచు, పుట్టుచు చచ్చుచు, నెన్నిజన్మములెత్తినను బంధముల మానఁజాలకున్నారు. తల్లియని, తండ్రిని, కొడుకని, బిడ్డని యూరక వ్యామోహమున మడియుచున్నారు. ఈజన్మమునఁ దండ్రియైన పూర్వజన్మమున రాఁగలజన్మమున నాతఁడెవరు! ఇది వివేకమార్గము కాదు.

గీ. "దీనశుభములేదు దివ్యకీర్తియులేదు
జగతిఁబుట్టిపుట్టి చచ్చిచచ్చి
పొరలనేల నెందు పుట్టఁ జావని
త్రోవవెదకికొనుట దొడ్డబుద్ధి."

1వ బాలక—అయ్యా! నీవుచెప్పినమార్గము వినినంతనే సన్మార్గమనిపించె. అయిన మన కెల్లరకు తరణోపాయమేదికలదు?

ప్రహ్లాద—కలవు. మార్గములెన్నియోకలవు తెలియక యాచరింపని వారలట్లుండ తెలిసి యాచరింపనివారి సంఖ్యయే యీలోకమున మెండు. అవిచెప్పవారుకలుగుటదుర్లభము. చెప్పినఁ జెప్పుదురుగాక వారేయాత్రోవఁద్రొక్కరు. ఇట్లేప్రపంచమంతయు రాగమయమై జనులు భవబంధములు బాయఁజాలక సంసారక్లేశములమునిఁగి తేలుచుందురు ఒకవేళమార్గము చూపినను దాని ననుసరించువారు లభించుట పరమదుర్లభము. మీకామార్గము జూపిన మీరొప్పుకొందురా? ఆచరింతురా?

2వ బాలక—అయ్యా! నీవు పుట్టిననాఁటినుండి మహామహుఁడవని పేరొందినవాఁడవు. చక్రవర్తికుమారుఁడవు. శైలపతన మొనరింపించియుండినను, బ్రతికివచ్చిన మహాపురుషుడవు. నీమాట మేముద్రోయుదమా?

ప్రహ్లాద—అట్లయిన వినుఁడు. సంసారమనునది గొప్పసముద్రము. మమ్ము నెల్లగముంచినది. అందుమునిగితిమా, లోపల చిమ్మచీకటి. కన్నులగానరావు. వెలుతురు తెలియదు. జలజంతువు లెన్నియో మ్రింగుటను కాచుకొనియుండును. వానిమీఁదఁజాలము. కన్నులు మూసుకొనియే వాని నోటఁబడవలయు. సుఖములే నేలేదు. బ్రతికినన్నాళ్లు దుఃఖమే అది మనముపరిగ్రహింపవచ్చునా?

బాలకులు—కూడదు, కూడదు, మనకు సంసారమువలదు.

ప్రహ్లాద—అట్లయిన వినుఁడు. దీనినుండితరింపవలయునన్న, మనకొకటేసాధనము. తారకుఁడు నొకడే. ఆతఁడు తననామస్మరణసేసి తన్నుభక్తితోఁ బూజించువారికి సంసృతి క్లేశములు దప్పించును. అతఁడుతప్ప రక్షకుఁడింక లేఁడు,

బాలకులు—ఎవఁడతఁడు. ఎవఁడతఁడు? అతనిస్మరింతము. భజింతము ఉపాసింతము

ప్రహ్లాద—అయిన వినుఁడు. అతఁడు వైకుంఠలోకమున నుండువాఁడు. ఆదిమధ్యాంతము లెఱుఁగనివాఁడు. భక్తులపాలిటిచింతామణి. నారాయణుఁడు. ఆతని శరణ వడయవలయునన్న నేండ్లకొలఁదిఁ బూజింపఁబనిలేదు కాయము శుష్కింపఁదపముసేయఁ బనిలేదు. భక్తిమై నతని నామముస్మరించి భజించినచాలును. అతఁడు జగద్వ్యాప్తుఁడుఁ కేశవాదినామముల లెన్నియోగలవాఁడు. అతనిభజంచిన మనకు భవబంధములు వీడును.

## అనుబంధము 30

బాలకులు—అయినఁ బ్రారంభింతము. ఎట్లుభజింపవలయునో యెఱింగించి మాకుమార్గదర్శివికమ్ము.

(ప్రహ్లాద—(లెండు అని బాలకులందరితో నిలువఁబడి భజనము సేయును).

## అనుబంధము 31

[పునః ప్రవేశము: శుక్రచార్యులు.]

శుక్ర—(బాలకులఁబిలిచి) బాలకులారా! ఏమి మీయాగడము? మీపాఠములమాని యిట్లేల యెగురులాడెదరు?

1వ బాలక—అయ్యా! ఇవియే మీపుస్తకములు. ఈపాఠములు మాకువలదు. ఇవిమీరేఁ గైకొనుఁడు. మాయాచార్యుఁడు ప్రహ్లాదుఁడు. మాకుతరణోపాయము గలిగించియున్నాఁడు దానిఁజూచుకొందుము.

2వ బాలక—అయ్యా! ఇన్ని సంవత్సరములనుండి మాకెన్నియో పాఠములఁజెప్పితిరి. ఈఁనాఁడు మేము నేర్చినపాఠము డొకనాడైనఁ జెప్పకపోయితిరే? సంసార సముద్రమున ముంచెడిపాఠములే చెప్పుచువచ్చితిరే? (అని పుస్తకములఁ బారవేయును.)

శివబాలక—కానిరా. ఊరకేల యాలస్యముచేసెదరు? మనపాఠము లొప్పఁజెప్పెదము.
(అని యందఱు భజనచేయుచు నెగురులాడెదరు).

శుక్ర—ప్రహ్లాదా! ఇదియా మాకిచ్చు గురుదక్షిణ? "తాఁజెడ్డకోతివన మెల్లఁజెరచె"నన్నట్లు చేసితివే. పోదమురమ్ము నీతండ్రియొద్దకు? నీదురుద్యోగమునకు ఫలముఁగందువుగాక.
(నిష్క్రమి).

———:o:———

చతుర్థాఙ్కము-చతుర్థరంగము.

———o———

సముద్రము.

[ప్రవేశము: ప్రహ్లాదునిఁబట్టుకొని కాలనాభుఁడు, వజ్రదండుఁడు మొదలగువారు]

(ప్రహ్లాదుఁడు హరిభజనము సేయుచుండును)

అనుబంధము 32.

కాలనాభ—ఓరీ! దుర్మార్గబాలకుఁడా! ఇంక నీయాయువు ముగిసె. ఇప్పుడైన నీవు హరిస్మరణమానితినని వచనమిచ్చిన మీతండ్రితో నెట్లులైనఁజెప్పి నిన్ను మన్నింపఁజేయుదుము. లేకున్న నిదె సముద్రమున నినుదూరముగొనిపోయి పాఱవేసివచ్చెదము.

ప్రహ్లాద—ఈజన్మమున హరిస్మరణమానుట నాచేతఁగానిపని.

కాలనాభ—సీ. నుడిరాని ప్రేలెదు బుద్ధులేఁడ నీవునీకింత
కావరమా నె హీనకర్మ

ప్రహ్లాద— అరుదారు భక్తిమె హరినామభజనంబుగడఁగి
చేయుట యిది కావరంబె

కాలనాభ— విడువిడుమా కూఁత విడకున్న నీవారినిధి
ముంచిచంపెద నిన్నుఁగూళ

ప్రహ్లాద— వెలయు శ్రీహరి ప్రాపు గలిగియుండఁగ
నిట్టిత్రోయధముల్ నన్నే మిసేయునయ్య

కాలనాథ—ఛీ! దురాత్మక హరిపేరు సెప్పకింక

ప్రహ్లాద— మదినడరియుండు నాపేరువదలనగునె

కాలనాథ—రమ్ము ముంచెదఁదీసెదఁ బ్రాణసమితి

ప్రహ్లాద— నటులెకానిమ్ము పిదప నాహరిగలండు.

కాల—అట్లయిన నీయాశ్వాసము ముగిసె పోదమురమ్ము.

(అని ప్రహ్లాదునీడ్చుచుండ).

[ప్రవేశము: బాలకులు.]

బాలకులు—అయ్యో! అతని విడిచిపెట్టుఁడు. మమ్మెవ్వరైన, లేక మమ్మందఱినైనఁ గొని పోయి సముద్రమున ముంచి వేయుఁడు.

కాలనాథ—దురాత్ములారా! మీకింతయహంకారమా.

(అని బాలకులఁగొట్టి పరువెత్తించును.)

కాలనాథ—(ప్రహ్లాదునిఁగొనిపోయి సముద్రమునవైచును ప్రహ్లాదుఁ డీఁదుకొనుచుఁ బోవుచుండ) (యవనికదిగఁజాఱును)

---

## చతుర్థాజ్ఞము-పఞ్చమరంగము.

---

వీధి

[ప్రవేశము: బాలకులు.]

1వ బాలక—ఏమిప్రభావమురా ప్రహ్లాదునిది? చిన్నిపాపఁడై సముద్రమధ్యమునఁబడి యీఁదుకొనిపోవబట్టెను. అప్పుడారాక్షస దురాత్ములు వాని సముద్రమధ్యమునకుఁ బట్టుకొనివచ్చి లోనముంచిరి. విడువకయే పోయిరి. పదిగడియలట్లు పట్టియుంచి విడువగా నారాయణస్మరణ యొనర్చుచు నట్టిలేచెను.

2వ బాలక—మరల వానిఁబట్టిముంచలేదా?

1వ బాలక—ముంచుటకని పట్టఁబోవవారికిఁ జిక్కకయే దూరముపోయెను. ఇంతలోనా రాక్షసులెక్కియున్న పడవ గొప్పగాలికిఁదల్లక్రిందై యా రాక్షసులే మునుఁగఁజొచ్చిరి. అప్పుడామహాత్ముఁడు నారాయణభజన మొనర్చుచు లక్ష్మీవల్లభా! వీరిని రక్షింపుమని వేఁడుకొని చావనైయున్న యాయిద్దఱిరాక్షసుల రెండుచేతులతో నీడ్చుకొనిపోయి గట్టుఁజేర్చెను. వారమృతతుల్యులై ప్రహ్లాదునిఁ గొనియాడుచు నిండ్లుసేరిరి.

3వ బాలక—చూచితిరా! ఇదియంతయు హరిస్మరణప్రభావము. మాయాచార్యుఁడగు ప్రహ్లాదుఁడు మాకుత్తమోపదేశమునుఁ జేసియున్నాఁడు. ఆస్మరణమాత్రము మేము గట్టిగఁబట్టితిమా మనకీడులేదు. ఏకీడునురాదు. (అని భజనముచేయుచుండ ప్రవేశము మఱియొక బాలకుఁడు)

3వ బాలక—మిత్రులారా! వినలేదా? ప్రహ్లాదుఁడు గట్టుజేరి తండ్రియొద్దకుఁబోయి పాద చూపినవెంటనే యాదురాత్ముఁడాజ్యాహుతిఁగొన్న యగ్నివలెమండిపడి తనయితర సేవకులఁబురికొల్పి పాములచేఁ బ్రహ్లాదుని గఱపించుటకై యుత్తరవిచ్చియున్నాఁడు. అయ్యో! యింకమాయాచార్యుని పాములుగఱచిచంపునే? ఎట్లుచేయుదము?

2వ బాలక—మనమందఱముపోయి ఆపాములవాఁడు తెచ్చిన సర్పములన్నిఁటిని జంపి వేయుదము.

1వ—బాలక—అవిజంపిన వేఱేకొన్నివచ్చును. దానివలననేమియుఁ బ్రయోజనములేదు సముద్రమునుండి యీఁదివచ్చిన మహాత్ముని పాములేమిచేయురా? మనమేమియుభయ పడవలదు. అతఁడు నమ్మిన నారాయణుఁడే యతనిపాలఁగుండువాఁడు. పోదము రండు.

అనుబంధము 33

(నిష్క్ర—9)

---

చతుర్థాఙ్కము-షష్ఠరంగము.

మేడ.

[ప్రవేశము: పాములవాఁడు పాములతో]

పాముల—పిల్లోని సంప్తే వక్కపూలు యిస్తాడంట. యెందుకబ్బా? మాపామునొకదాన్ని పంస్తే అరగడియలో బూడిదసేయదూ? అందుకే నమ్మకంగా. సంపేదానికి రెండు పాములతెచ్చియుండాను. ఆపిల్లోడు యిక్కడికేవస్తాడంట. రెండున్ను విడిచేస్తా. అదిగో వస్తుండాడు.

[ప్రవేశము: ప్రహ్లాదుఁడు పాడుచు.]

అనుబంధము 34

పాముల—(రెండుపాముల వానిపైవిడుచును. అవికఱవకముందే రెండుగరుడపక్షులు ప్రవేశించి వానినెత్తుకొనిపోవును) అయ్యో! ఛాబంగారమువంటి పాములు పోయినవే (అని ఏడ్చును) (యవనిక దిగఁజాఱును).

—() చతుర్థాఙ్కము సమాప్తము ()—

శ్రీ

# ప్రహ్లాదనాటకము.

## పఞ్చమాఙ్కము-ప్రథమరంగము.

### హిరణ్యకశిపు నగరు.

[ప్రవేశము: హిరణ్యకశిపుఁడు లీలావతి.]

లీలా—నాథా! ఈకార్యము మాత్రమువలదు. ఇంకనైన వానిననుగ్రహింపుము. మన చేతులార మనబాలునికి విషమీవలయునన్న, నెట్టికాలమనవలయును? అయ్యో! నేనెట్టులోర్తును? వలదు-వలదు. ననుమన్నింపుము. ఆవిషము నాకిమ్ము. నేమృతిఁ జెందెద. పిదప నీయిష్టమునకు వచ్చినభంగి వానిఁజంపుము.

హిరణ్య—తరుణీ! నీకెట్టియవివేకము! ఇంతెదుగాత్ముఁడై నన్నుసరకుసేయనివాఁడు మనియుండిన రాష్ట్రమంతయుఁ జెడిపోవుఁగదా? చూడుమిప్పుడే మనయూరిబాలురకు వానియుపదేశము పట్టుపడి, యసాధ్యముగా హరిభజనమొనర్చుచు నూరిపెద్దలకు వారేయుపదేశకులైయున్నారఁట! ఇంక నేబ్రతికియుండి యేమిఫలము! వానిఁజంపనే వలయు. కావున నీవిషముఁదెప్పించితి. శైలపాత మొనర్చినప్పుడు నాభటులే బొంబాటొనర్చి యుండవలయు. సముద్రమునఁద్రోసినవారును వారేయైనందున, వారితియులకు లోనై చక్కఁగాకార్యము నిర్వహింపక సముద్రమునఁ బడవైచినట్లు పడవైచి వాని నీఁదించుకొనితెచ్చి, వాఁడే తమ్ముద్ధరించినట్టు నాతో నబద్ధములాడియుండుగని నాకుఁ దోఁచుచున్నది. ఇంక నాపాములవాఁడన్ననో, వాఁడులోఁబడుట యేమియెక్కువ? గరుడపక్షులువచ్చి పాములనెత్తుకొని పోయినట్టు నాతో నబద్ధములు చెప్పియుండవచ్చు. కావున నేనెవ్వరినమ్మఁటకును సాధ్యముగాదు. నేనైన, నీవైనఁ జేతులార నీకార్యము సేయకున్న నాకువిశ్వాసముగలుగదు. నాకుఁజూడ నారాష్ట్రములోని వారందఱుఁ జిన్నవాడని ప్రహ్లాదునియెడఁ బక్షపాతముకలిగి నాయాజ్ఞ నిర్వహించుటకుఁ గొంకుచున్నారని నేనెంచెద. అదిగోవచ్చుచున్నాఁడు. నేనేయొసంగెద వానికీవిషము? వాఁడుతీసికొనకున్న నీవైన బుజ్జగించి త్రాగునట్లొనర్పుము. అక్కడకు సాధ్యముకాకపోయెనా, సేవకులఁ బిలిపించి క్రిందఁబడఁద్రోసి బలవంతముననైనఁ ద్రావించెద.

[ప్రవేశము: ప్రహ్లాదుఁడు హరిభజన చేయుచు.]

ప్రహ్లాదా! ఇటుగమ్ము. ఇదేయీపాత్రమున విషమున్నది. ఈశ్వరుఁడు మ్రింగిన హాలాహలమునకు రెండవది యని పేరొందినది. అశ్వినీదేవతలనడిగి నిర్బంధించి దీనిఁ జేయించియున్నాను. ఇంకనీ రెక్కలుముక్కలాడనివ్వను. చెప్పుము కడసారి. నీవు హరిస్మరణ మానెదవా లేక యీవిషము భుజించి చచ్చెదవా?

అనుబంధము 35

ప్రహ్లాద—(చేయిసాచి) అయ్యా! నీవు నాకు పరమోపకారివి. రెండుమార్గముల నాకుఁ జూపితివి. హరిస్మరణమిడుపుమని యొక్కమార్గమే నాకుఁజూపిన దుఃఖించుచుంటిని కాని, యిప్పుడు కడుసంతోషమయ్యె. తెమ్ము ఆవిషమునిట్లందిమ్ము.

లీలా—కుమారా! ప్రహ్లాదా! వదలుమా! అయ్యో! ఆవిషమించుక నాలుకపైఁబడిన నెవఁడుగాని మడియునఁట వదలుము హరిస్మరణ. విడిచితిననుము.

ప్రహ్లాద—అమ్మా! నీవూరకుండుము. చూచెద నావిషమునందట్టి మహాత్మ్యమున్నదేమో? (విషపాత్ర చేఁబట్టుకొని) అయ్యా! యీవిషమంత చెడ్డదియా? హాలాహల ప్రతిమానమా? (అని నోటికెత్తి త్రాగును).

లీలా—(హా! యని గట్టిగనఱచి మూర్ఛిల్లును)

ప్రహ్లాద—అమ్మా! అమ్మా! (అని తల్లియొద్దకుఁబోయి శిశిరోపచారములఁ జేయును).

అనుబంధము. 36

హిరణ్య—(స్వ) ఆహా! ఏమనవలయు? ఆవిషము తప్పక చంపునదియని చక్కఁగ పరీక్షించి గుణముగుఱుతించి తెచ్చియుంటినే? త్రాగుచునక మునుపే పానకము త్రావినట్లు త్రావి యించుకంతయుఁ దెలివిచెడకయున్నాఁడు.

చం. "ఎఱుఁగడు జీవనౌషధము నెవ్వరుభర్తరు లేరు బాధలన్
దఱుఁగడు నైజతేజమున తథ్యముజాడ్యములేదు మిక్కిలిన్
మెఱయుచునున్న వాఁడొకనిమేషము దైన్యము నొందడింకనే
తెఱగునద్రుంతు వేసరితి దివ్యము వీనిప్రభావమెట్టిదో".

(యవనికదిగజాఱును).

——:0:——

## పంచమాంకము-ద్వితీయరంగము.

### అ డ వి.

[ఒకప్రక్కన నేనుఁగులగుంపు. వెనుకభాగమున యవనికాభ్యంతరము మాత్రముగలిగి ప్రజ్వరిల్లుచున్న యగ్నిజ్వాలలు. ప్రక్కన బాలకులు. మధ్యప్రదేశమున ప్రహ్లాదుఁడును రాక్షసులును.]

రాక్షసులు—ప్రహ్లాదా! అదే యేనుఁగులు వచ్చుచున్నవి. ఆవెనుక నగ్నిమండుచున్నది. మావిభుని యాజ్ఞమాకైయున్నది. నీవుహరిస్మరణ విడిచితినంటివా నిన్ను దనయొద్దకుఁ దెమ్మనిరి. లేదంటివా నిన్నీయెడఁ గట్టివేసి యేనుఁగులతోఁ ద్రొక్కింపుమని మాకునాజ్ఞ. హరిస్మరణ విడిచెదనందువా—లేదా?

ప్రహ్లాద—ఇదిగో—హరిస్మరణము దిగ్దేశముల వెదచల్లుటకై విడుచుచున్నాను. (అని గట్టిగపాడును).

అనుబంధము 37

రాక్షసులు—(ప్రహ్లాదుఁడు పాటపాడుచుండఁగనే! క్రిందఁగడపి చేతులు కాళ్లుబిగఁగట్టి ఏనుఁగుల విడువుఁడు అని గట్టిగా నఱచుదురు).

బాలకులు—(ముందటికివచ్చి) అయ్యో! అయ్యో! ఈపాడేనుఁగులు మాయాచార్యునిఁ జంపుచున్నవే! మనమైనను బోయి యడ్డపడుదుమా?

1వ బాలక—మిత్రులారా! మనముపోయి యేమియుఁబ్రయోజనము లేదు ఆరాక్షసులు మమ్ములఁదఱిమివేయుదురు నారాయణ ప్రభావమున మనయాచార్యునకేమియుబాధ గలుగఁజాలదు. కావున నీనాఁడు దఱుఁజేరి మాగురుఁడు వెలికివచ్చిన వెంటనే యతని నేకాంతమునకుఁ బిలుచుకొనిబోయి మనమందఱముఁగలసి హిరణ్యకశిపుని రాష్ట్రము విడిచిపోయి వేఱొకచోట సుఖముగానుందమని బోధింతము. అతనికి వేఱుబాధలు లేకుండఁజేయుదము.

[ప్రవేశము: ఏనుగుఁలు ప్రహ్లాదునిఁ ద్రొక్కుచుఁబోవును.]

ప్రహ్లాద—(అను: 37 ఒక్కచరణము పాడుచుండును).

రాక్షసులు—దురాత్మా! ఇంకనుఁజావవా? కానిమ్ము. ఏనుఁగులు ద్రొక్కిచంపిన నీశవము నగ్నిలోవేయ నెంచియుంటిమి. ఇప్పుడటుకాకున్న నిన్నేయందుంచి దహింతుము. (అని యెత్తుకొనిపోవుదురు).

[వెనుక యవనికనెత్తగా గొప్పయగ్నిఁ గనిపించును. దానినడుమ ప్రహ్లాదుఁడునిలిచికొని అను: 37 రెండవ చరణము పాడుచుండ.]

(యవనిక దిగజారును)

—:():—

## పఞ్చమాఙ్కము-తృతీయరంగము.

———:0:———

### వీధి.

[ప్రవేశము: బాలకులు.]

1వ బాలక—మనతల్లిదండ్రులిట్లు చెప్పుచున్నారే? మనమేమిసేయవలయు? అదిగో! నీతివేదివచ్చెను.

[ప్రవేశము. నీతివేదియను బాలుఁడు.]

నీతివేది—ఏమిరా? నన్నిక్కడికి రమ్మనిచెప్ప నంపితిరి?

1వ బాలక—అయిన నీవేమియు వినలేదా?

నీతివేది—ఏమియువినలేదే? నిన్న ప్రహ్లాదుని నేనుఁగులతోఁ ద్రొక్కించిరఁట. మీరందఱుబోయి యుంటిరఁట. ఇంతమాత్రముదెలిసె. ఇప్పటికి నాకింకను దలనొప్పిదుర్భరముగానున్నది.

1వ బాలక—వీనికెట్లు తెలియవలయు మనకుఁ దల్లిదండ్రులున్నారు గనుక వారిగోడు వారుచెప్పుకొనిరి. పాపము నీతివేదికేమి తల్లియా, తండ్రియా వానికెవరు చెప్పవలయు?

నీతివేది—ఏమిరా మీతల్లిదండ్రులగోడు? వినుటకు చిత్రముగానున్నది. నాకింతయెఱింగింపుఁడు.

1వ బాలక—నీకెఱింగింపక మేమేమైన నడుచుచుంటిమా? వినుము. ఆనాఁడు మనయాచార్యుని సముద్రమున వైవఁబోవ మనమువలదని యడ్డముపోవలేదా? ఆవృత్తాంతము హిరణ్యకశిపునికి, నివేదించినంతట నాతఁడు మండిపడియెనఁట? మరల నిన్న మనము పోయి వృత్తాంతము రాక్షసులు రాజుతో జెప్పిరఁట? రాజు రేపు నిండుసభచేయునున్నాఁడఁట ఆసభయెదుటనే యురిదీయుటకై మ్రానుగట్టించియున్నాఁడఁట? ప్రహ్లాదాచార్యుని నురిదీసినపిదప మమ్మెల్లరవరుసగా నురిదీయుటకై యేర్పరచియున్నాఁడఁట. మమ్మెల్లరబట్టుకొని నిర్బంధమున నుంచుటకు సేవకుల మాయిండ్లకీరాత్రియే పంపుచున్నాఁడఁట మాతల్లిదండ్రులు మమ్మెక్కడకైన వెడలిపొండని బోధించియున్నారు. ఏమిచేయుదమని యాలోచించుటకై యిందుఁజేరితిమి. ఇదియేమాకథ.

నీతివేది—మీరేమి నిర్ధార మొనర్చియున్నారు?

1వ బాలక—ఏమియు నిర్ధారమొనర్పలేదు. నీకొఱకై వేచియుంటిమి. ఇందేయుండి ప్రహ్లాదునితోఁగూడ నురిదీయఁబడుదమా లేక దేశభ్రష్టులమై కానరాకుండఁ బోవుదమా? ఈరెంటిలో నొకటికర్తవ్యము.

నీతివేది—నాయభిప్రాయము చెప్పుదునా ?

1వ బాలక—చెప్పుము.

నీతివేది—ప్రహ్లాదాచార్యుని నొంటిగవిడిచి మనము వెడలిపోవుటయెంతయు నయుక్తము. అతఁడురిదీయ బడఁజాలఁడు అతని నారాయణుఁడు కాపాడఁగలవాఁడు. మనయాచార్యుఁడు మమ్ము గాపాడువాఁడు. ఒకవేళ నతఁడురిదీయఁబడి ప్రాణములఁబాసెయు, యతఁడు పోయినపిదప మనియుండియుఁ బ్రయోజనములేదు. కావున సంతోషమున మృతిఁజెందుదము. ఒకవేళ నతఁడు కాపాడఁబడి మమ్మురివేసిరా యదియేమేమివ్వగల యాచార్య సంభావయని యెంతము. ఎట్లుచూచిన నిదియేవిధానము.

బాలకులు—భళీ ! భళీ ! నీతివేదీ బాగుగఁజెప్పితివి. మాకెల్లరకిదియే యభీష్టము. జయ జయ, మాధవ జయగోవిందా ! (అని భజనచేయుదురు.)

అనుబంధము. ౨౯

(నిష్క్రి)

———(o)———

## పంచమాఙ్కము-తురీయరంగము.

[ప్రవేశము హిరణ్యకశిపుఁడు, మంత్రులు, సేనాధిపులు, సేవకులు. (శుక్రుఁడు, చండుఁడు, అమర్కుఁడు, ప్రహ్లాదుఁడు. బాలురును భుజబద్ధులైయుందురు. ఆస్థాన స్తంభములు మనోహరమైనవి కనుపించుచుండును. ఒకచో నురిమ్రాను కనుపించును].

సేవక—అయ్యా ! మేముమంచిపగ్గములతో నెన్నిమారులు నురివేయించినను బగ్గములు దెగినవి మాతప్పితముగాదు. ఈసారి యినుపసంకెలలఁ గట్టియున్నారము. ఇంక తెగుటకుఁ గారణములేదు. మన్నింపుము. ఇకమరల నెత్తెదము. (అని ప్రహ్లాదునిమ్రానికి నెత్తినురివేయుదురు. యినుపసంకెల తుత్తునియలై క్రిందఁబడును. అందఱు నాశ్చర్యము నభినయింతురు.

హిరణ్య—(గద్ది యడిగివచ్చి) (స్వగతము).

ఉ. "ముంచితివార్ధులఁ గదలమొత్తితి శైలంతటంబులందుఁద్రో
బ్చించితి శస్త్రరాజిఁబొడిపించితి మీఁదనిభేంద్రపఙ్క్తిఁద్రొ
క్కించితి ధిక్కరించితి శపించితి ఘోరదవాగ్నులందుఁద్రో
యించితిఁ బెక్కుబాధనలయించితిఁ జావఁడిదేమిచిత్రమో".

(ప్రకాశము).

సీసమాలిక.

హిరణ్య— కాలాహితతులతోఁ గఱవంగఁ జేసినిన్
జంపంగఁ బంచితిఁ జావవైతి.

ప్రహ్లాద— గరుడవాహనమున నరుదారు ఘనునకా
తుచ్ఛోరగంబులఁ ద్రుంచు టెంత

హిరణ్య— ఉడికించు నగ్నిలోఁ బడఁద్రోసి కాల్చినిన్
జంపఁగ నెంచితిఁ జావవైతి.

ప్రహ్లాద— తాపత్రయము లెల్లఁ బాపు ధీరునకు నా
చిఱుతమంటలఁ జల్లఁ జేయు టెంత.

హిరణ్య— విలయంబుగా భూరిజలరాశి ముంచినిన్
జంపఁగ నెంచితిఁ జావవైతి.

ప్రహ్లాద— కడఁగి సంసృతివార్ధిఁ గడ చేయువానికిఁ
దెలియఁగాం జెప్పు వార్ధిఁ దేల్చు టెంత.

హిరణ్య— ఘనమీఱు మదపుటేనుఁగులచేఁ ద్రొక్కించి
చంపఁగ నెంచితిఁ జావవైతి.

ప్రహ్లాద— కరిరాజవరదుఁడై యరుదు దూరువానికి
నీగజశక్తి మాయించు టెంత

హిరణ్య— వెగటుగా నసహామహా విషము ద్రావించినిన్
జంపంగ నెంచితిఁ జావవైతి.

ప్రహ్లాద— అలభోగిరాజశయానుఁడౌ విభునకు
నీయల్పవిషము మాయించు టెంత.

హిరణ్య— కడఁగి మాయల నెల్లఁ గల్పించి భయపెట్టి
చంపంగఁ బంచితిఁ జావవైతి

ప్రహ్లాద— ఇలలోని యెల్లమాయలడంచువానికా
దనుజమాయలఁ దీర్చుటనఁగ నెంత.

హిరణ్య— తే. గీ. ఎన్ని విధములనో నిన్ను హింసపెట్టి
చంపఁగాఁ బంపినను నీవుచావవైతి.
ప్రహ్లాద— అసురనాయకా నీకేల యజ్ఞభంగి
మాధవుని భక్తులకు నెందు బాధగలదె.

హిరణ్య—ఓరీదురాత్మా! ఎన్ని విధములనో నిన్నుఁ జంపు నెంచితి. విఫలమనోరథుఁడనైతి నీకేమైన మందు. మంత్రము తెలియునేమిరా చావకుండుటకు?

ప్రహ్లాద—అయ్యా! మందుమంత్రములేక యింతబ్రతికియుండుటకు సాధ్యమా? నామందు వినుము.

సీ. ఎల్లెడ సేవింపనుల్లసిల్లెడుమందు
మందులలోనెల్లమంచిమందు
పొలుపారభవరోగములను దీర్చెడుమందు
మందులయజ్ఞతమాన్పుమందు
కడుకొనియెంద్రైనఁగానంబడెడిమందు
వెదుకంగఁబనిలేకవెలయుమందు
పథ్యంబపథ్యంబు పలుకఁగోరనిమందు
వండకనూరకఁ బరగుమందు

తే. గీ. దనరుహరిపాదతీర్థంబు తప్పనింక
నొక్కయనుపానమును గోరకున్నమందు
అదియెఁ జెప్పెదనేమని యడుగదేని
సమ్మదము మీఱ తులసీదళమ్ము తండ్రి.

ఇంక నామంత్రమంటివా అదియుఁ జెప్పెదవినుము.

సీ. కమనీయసద్గుణ గణములకెల్లనా
కర్షణమంత్రమైకాంతిమీఱు
భరియింపఁగారానిపాప సంతతికిది
గ్బంధనమంత్రమైకవియనీదు

అనయంబుమశ్చింతలను భూతతతికిను
చ్చాటనమంత్రమైసడలఁజేయు
కామాదులగులోనఁ గదురుశత్రువ్రులకు
మారణమంత్రమైప్రమందఁజేయు

తే. గీ. దానికిపురశ్చరణయును, దానములును
హోమమును జపమును శాంతియొకటిలేదు
రెండుమూఁడక్షరములలో నిండియుండు
నదియు మాధవయను మంత్రమమరవైరి.

హిరణ్య—పాపకర్మా! మాధవ మాధవయని యూరకవదరెదవే? వైకుంఠమునంతయు వెదకివచ్చితినే, చిక్కియుండినఁ గుమ్మిచంపుచుంటినే? అప్పుడెక్కడనుండెరా? నిప్పుడెందున్నవాఁడురా?

ప్రహ్లాద—అయ్యా! ఎల్లకడలనున్నవాఁడు. నీయందు, నాయందు, చూచినపదార్థములయందు, ఇందున్నవాఁడందున్నవాఁడని చెప్పనేల? ఎందుఁదలఁచిన నందున్నవాఁడు.

కం. "ఇందుఁగలఁడందు లేఁడని
సందేహమువలదు చక్రిసర్వోపగతుం
డెందెందు వెదకిచూచిన
నందందేగలఁడుదానవాగ్రణివింటే"

హిరణ్య—(కోపమున) చూపఁగలవా వానిని? ఇందున్నఁజూపుము. పోడనూపెదా వానిని, వానితోడ నిన్నుఁజంపి చెండాడెద. (అని చేపట్టియీడ్చును).

ప్రహ్లాద—ననుఁజూపమన నేల? నేనీస్థలమని చెప్ప నేల? నీవే కోరికొమ్ము. నీవే కనుగొమ్ము.

హిరణ్య—దురాత్మా! ఇదే మాతుమీ ఖడ్గము. దీనిలో విష్ణువును జూపకున్న యిప్పుడే నీతలఁ దునుమాడెద. ఎందైననున్నాఁడా? ఈఖడ్గమునను న్నాఁడా? ఈసింహాసనమున నున్నాఁడా? ఈదివియనున్నాఁడా? ఈ స్తంభమునను న్నాఁడా?

అనుబాధము 39

ప్రహ్లాద—నీవడిగిన యన్నిటియందును, నింకనడుగఁబోవు నన్నింటియందును న్నాఁడు.

హిరణ్య—చూపకపొమ్ము. చూపరా కుటిలమానసా! ఈ స్తంభమున? (అని స్తంభమును జేతితో గట్టిగఁగొట్టును ఉరుములు మెఱుపులు మహాధ్వనులు పుట్టును. మహాధ్వనితో స్తంభము రెండైపడును).

[ప్రవేశము: స్తంభము మధ్యమునుండి నృసింహమూర్తి.]

హిరణ్య—ఔరా! నీవా నారాయణుఁడవు? ఇప్పుడెందుఁ దప్పించుకొనఁగలవు? (ఇరువురు యుద్ధమాడెదరు. నృసింహమూర్తి హిరణ్యకశిపుని గడపపైఁ బరుండఁబెట్టి ప్రేగులాలచి హారము వేసికొనును).

[ప్రవేశము: (శీఘ్రగమనమున) నలువైపులనుండి లక్ష్మి, ఇంద్రుఁడు, శచి, దిక్పాలురు, ఋషులు, నారదుఁడు, బ్రహ్మ, సరస్వతి.]

అందఱు—(చేతులు జోడించుకొని భయమునభినయించి నృసింహుని వైపునఁ జూచెదరు)

ఇంద్ర—దిక్పాలురారా! ఋషీంద్రులారా! ఇట్టిభయంకరాకారమెందును జూడము. పలుకరించుటకైన నంతించుటకైన సాధ్యముగాకున్నదే? ఎవ్వరీ నరసింహు వారిని మాటలాడింపఁగలవారు?

ఋషులు—ఎవరికిసాధ్యమబ్బా! ఎవ్వరిచేతనుగాదు. ఇదేమాతల్లిలోకమాత రమాదేవి వచ్చియున్నది. ఆమెకైన సాధ్యమగునేమో?

లక్ష్మి—అయ్యలారా! నాచేతనుఁగాదు. నామనోహరునికిట్టియాకార మిట్టియాగ్రహ మెందెందు నెఱుఁగ. నేనిప్పుడు మాటలాడింపఁజాల.

ఇంద్ర—నారదా! నీవెప్పుడును రమారమణునొద్ద గానమొనరించి చనవుఁబడిసినవాఁడవు. నీవించుక యిపుడుమాటలాడింపరాదా?

నారదా—అబ్బా! యిదిగానమునకు కాలమా? మానమునిలుచునా? ఏనాఁడెప్పుడైన శాంతభావముతోనుండి యామహాత్ముఁడే నన్నింత వీణవాయింపుమన్న యటులమీటు చుంటిఁగాని నేనైనమాటలాడింపుమనంత చనవు నాకుఁగలుగదు. ఉండెఁబో నిట్టివేళ నది పనికివచ్చునా? కాదు-నాచేతగాదు.

ఇంద్ర—ధాతా! నీవుకుమారుఁడవు. నీతల్లి కాదనియె. నీకుమారుఁడు వల్లదనియె నీకేల శ్రమ యీవలయునని యింతవరకూరకుంటిని. నీకింకఁ దప్పదు.

బ్రహ్మ—దేవేంద్రా! కొంచమోర్చుకొనుఁడు. ఇప్పుడు సమయముగాదు. కొంచెము శాంతపడనిమ్ము.

## అనుబంధము 40

ప్రహ్లాద—(నృసింహుని సమీపించి) మహాత్మా! నాయెడఁగల యవ్యాజకరుణచేఁగదా నామాటదక్కించితివి. నీదర్శనమువలని ధన్యత నాజనకుని మరణమువలనఁ గలిగిన దుఃఖమునుసహితము మాన్పించె శరణాగతరక్షకా! ఇదేనమస్కరించువాఁడ (అని నమస్కరించును).

నృసింహ—కుమారా! లెమ్ము. నీభక్తికి సంతసించితి. (అని తలపై చేయిపెట్టును).

అందఱు—(కరతాళ ధ్వనులొనర్చి మంగళము పాడుదురు).

—() ప్రహ్లాదనాటకము సమాప్తము. ()—

———:o:———

# అనుబంధములు.

——:o:——

అనుబంధములు.

1. రంభ—రాగం-బేహాగ్ అదితాళము.

వింతాయె-వినఁ సంతసమాయెనుగా-దేవేంద్రా సురనాథా
అడఁగెను దేవారి బెడిదపుఁదపమునఁ గూరి వడి ప్రాణంబెడబాసి
మనసున నానందమును మిగులఁగ నీవొంద దనుజుండు మృతిఁ జెందె.

2. లీలావతి—రాగం-ఝంఝూటి రూపకతాళము.

కటకటకటా నన్నెవ్వరు కావరారుగా
కుటిలతతో నీచాత్ముఁడు గొనువెటఁగా
అనాథనై యున్ననను మనసుకొనను
కనికరమే గణింపక కడఁగితెచె గా
మనఁజాల బాపమింత మహినిసుండునే
తనరంగా నన్నుబ్రోచి దయజూడరే ॥ప॥
అరణ్యమందెవ్వరు నాదరంబున
గరుణించి నన్ను నేఁడు కాపాడరారే
విరోధ మెంతయో పెంచినాఁడుగా
ధరలోన నింతపాప కార్యమున్నదే.

3 నారదుఁడు—గేయము.

మురాదిదానవ విరామ కేశవ పరాత్పరా భవ మోచనా
హారాదివందిత ధరాధినాయక వరాంబుజాతవిలోచనా
అపారనిస్తుల కృపాకరాభక్త పాపతతి విచ్ఛేదనా
విపాక కారణ విపక్షనాశన సుపావనా మధు సూదనా
దినాధిపాబ్జ నయనా రమావర వినాయకాంచిత వాహనా
ఘనాఘనాంచిత విశీలవిగ్రహా సనాథలోక విమోహనా.

4 లీల—రాగం కాంభోజి ఆదితాళము.

తాపసపుంగవమా వింటికాదే
పాపమైనర్భను బాలవిరోధి
ఇంతయుఁగ్రూరత నెంచకయీలాగున
పంతముతోనిటు బాధలఁజేసె

నార—ఈసతియాడినదే నిక్కమౌనె
వాసవయింతటి పాపముకలదె
ధీరపతివ్రత యీరమణీమణి
వైరముసేయఁగఁ గారణమేమీ.

ఇంద్ర—మానినీకులాభరణా యీలతాంగి
నేనిటు తెచ్చుట నేరమె చెపుమా
వైరము లేదీగర్భ బాలుఁడు క్రూరుఁడని
కోరితినీమె కుమారువధింప.

5 విష్ణు—రాగం-హిందూస్తాని-జంజూటి రూపకతాళం.

మానులార వానికీ మంచికాలమిప్పుడు
మంచికాలమిప్పుడు కొంచెమట్టులుండనీ
ధాతయొసంగినవరముల్ తలఁపవలదెనామదిలో
చూతుఁగాకముందువీని జోలియిప్పుడేటికి
జోలియిప్పుడేటికి నే తాళవలయునూరక.

6 ఇంద్రుఁడు—రాగం-సావేరి రూపకతాళము.

శ్రీవాసుదేవా మాధవా కావావెదాసుని
భావంబునందు నిన్ను నేవేళ నెంచెద
నీపాదనీరజాతముల్ నాపవెకూరిమిఁ
గాపాడవేదయాకరా యాపన్నరక్షకా:

7 విష్ణు—రాగం-హిందూస్తాని-మోహనకల్యాణి రూపకతాళము.

ఓసురగురుసురవరులారా వలదింక మనమునశోక
ఆతురమునఁదలకఁగనేలా ·చనుడింక మీపురివంక

యిదిభరమనితలఁపకుఁడయ్యా హితులారా స్థిరమతులారా
మదిలోనఁజింతమానుండు పోయిమఱిరండు యింతచననిండు
మీమదిలో వెతపోనిండు.

8 లీలా రాగం-బేహాగ్ ఆదితాళము.

రారాధీలోలా నాబాలా రాజితగుణజాలా ॥పల్లవి॥
కాలియందెలు ఘల్లునమ్రోయ బాలారమ్మందు
బిరబిర బాలారమ్మందు బాలారమ్మందు
తనయా లీలగనుఁగొందు ౧
తటతటనంజలఁ దాళము వేసి యిటురారాపుత్రా
గునగున నిటురారాపుత్రా ఇటురారాపుత్రా
తనయా హేమాంచితగాత్రా
రామకృష్ణకవి రత్నముఁబ్రోకఁ దామసమింకఁ
దగదురా తామసమింక తామసమింకఁ
తనయా తనుజితమీనాంక.

9 లీలా—శ్రీరాగం-రూపకతాళము.

సుకుమారా గుణశాలీ అకలంకాననలాలీ ॥పల్లవి॥
మదనసమాంచితరూపా మానితనిర్జితపాపా
నిదురపో చిటిపాపా నేపాడెదనిదె జోజో
జోజోముఖజితచంద్రా సురుచిరభోగజితేంద్రా
జోజో తేజస్సాంద్రా శుభకరతనుఘనజోజో
లాలిలసద్గుణజాలా లసమానాశ్రితపాలా
లాలికవి రామకృష్ణ లాలితసురుచిరబాలా

10 ప్రహ్లాద—రాగం-శంకరాభరణం ఆదితాళము.

నారాయణభజ నంబు ధరలో సారంబై సదిగా ॥పల్లవి॥
నోరారంగను జేయఁగరాదే సారంబై వదిగా ॥అను॥

పగలును రాతిరి మానక యుండ భజనము జనులారా
మిగుల సంతసంబగు మదిలోనఁ బగవక చేయండీ జనముల్
వింతగు భక్తిని భజనమొనర్చెడు వేగమె కేశవుని
సంతసమారఁ జింతులుదీఱ సల్పెదు మీమదిలో జనముల్

11 ప్రహ్లాద—రాగం-బేహాగ్ ఆదితాళము.

నాకన్నులారఁగాను నేనిన్నెందుఁజూతునో
నిన్నెందుఁజూతునో నేనెన్నాళ్లు కాతునో.
భూరిదయమించి చెన్నారననుం గాంచి
నేరములమన్నించి యో శౌరీ రమాధవా ౧
బాలకుండటంచు నే పాపమెఱుఁగనంచు
చాలదయరావించి పాలింపు కేశవా ౨

12 ప్రహ్లాద—రాగం-సురటి ఆదితాళము.

మానసంబున కానందమాయె
ఆనందమాయె బ్రహ్మానందమాయె
కోరి కోరి చేరిపిలువ నారాయణాయన్న నామం బెచాలు ౧
హరినారాయణు దురితనివారణు
గరుడశతాంగుని స్మరణంబు మీఱ.

13 ప్రహ్లాద—రాగం-బేహాగ్ ఆదితాళము.

జగములో దైవమీవే యీజగములో
మిగుల వెదకి కనుఁగొంటి మురారీ
పగలనడఁచి పరమానందమెసఁగఁగ ॥జగ॥
చింతలఁబాసితి జేరఁగవచ్చితి
సంతసమారఁగ నీకడకిపుడే
సంతోషమారంగఁ గాపాడు శ్రీహరీ ॥జగ॥
నీదయనాయెడ నిండగనెందును
ఖేదముగల్గదు మానసమునకుఁ
అదరమారంగఁ బాలింపు మాధవా

14 ప్రహ్లాద—రాగం-కాఫి ఆదితాళము.

సారసాక్షినీ చరణకమలముల్ చేరికొలుతు శౌరి శ్రీరమణా॥గిరి
వైరివిదారి పాపహారి క్రూరదనుజవైరి శ్రీరమణా ॥గిరిధారి॥
కమలచరణా కాంతకరుణా విమతచయహరణా
విమలధామా వినుతనామా కమలావరవామా॥శ్రీరమణా॥గిరి॥
సామజపాలా సద్గుణజాలా ఖామితబహులీలా
రామకృష్ణకవి రక్షణశీలా సామగానలోలా ॥శ్రీరమణా॥గిరి॥

15 ప్రహ్లాద—రాగం-కాఫీ ఏకతాళం

దీనర్థిపాలనా శ్రీనాయకా
శ్రీనాయకా హరి శ్రీనాయకా
మీనావతారా మానాయకా॥
వేదాంతవేద్యా కేశవా దామోదరా
సిత్యాదరా వనజోదారా
నీదాసుఁడను బాలింపుమా సాదరంబున
పాదంబుజంబులన్ భక్తిమెయిన్
మోదంబు మీఱఁగ మ్రొక్కెదనే ॥శ్రీనాయక॥

16— ప్రహ్లాద—రాగం-కాఫి ఏకతాళము.

మన్నించికావవే దేవా కరుణించిచేకొనిమనవి
సేవించివేఁడెదమునిన్నుఁ బాలించియీఁగదే భక్తి
నీ సమానదైవము నెందుఁ గన రమారమణనన్నింపు
నీ కుమారుఁడనిసొంపొందు కరుణా కరుణవానకో
గోవిందా కలి తమానితాశ్రితబృంద.

17 ప్రహ్లాద—రాగం-సాధనామక్రియ అదితాళము.

కమలనయనశౌరి కలుషహర కమలనయన
కమలవాశినీ కాంతమునివరా వనఘనదయాకర.

సుర పాలనమనసిజయ సుందరమాధవసదా
నీ లీలనుమనసునఁగొనియాడుదుముకదా
శ్రీలోలాశ్రితవారరంజన ॥కమలవాసినీ॥
నినుఁబాయనిభక్తినుతింతుఁగదాగిరిధరా
నారాయణాధరాధారాదానవహరా
మాయాతీతగుణాంచితాహారి ॥కమలవాసినీ॥

18 ప్రహ్లాద—రాగం-మాండ్ రూపకతాళము.

కలుషహరణ భువనభరణ జలజచరణరా
దళితదానవరా కలితనిర్జరరా జలజయనరా
దినాధిపతి చంద్రమా దివ్యలోచనా
అనాథరక్షకా మాధవా పాపవిమోచనా
ప్రణుతపాలనరా వినుతసద్గుణరా మనసిజపితరా
కరీంద్రఘన రక్షణా సురపవందితా
సురారిహరా రామకృష్ణ సుకవివందితా
గరుడగమనరా నిరతపావనరా దురితమథనరా.

19 రాగం-కేదారగౌళ రూపకతాళము.

ప్రహ్లాద— తలఁపుమానఁగ తండ్రిసాధ్యమే దానవారిపేరు
మలఁగిమెందు మానసవీథిని వెలసియుండగ విడవకుండగ.

లీలా— ఏలచేయఁగ నింతకోపము చాలుఁబ్రాణనాథ
బాలుఁడువీఁడుపాపమెఱుంగడుమేలుగల్గునె బాలకుఁజంపఁగ

హిరణ్య— వైరిగాకవాఁడుపుత్రుఁడే వారిజాక్షిక్రూర
యూరకయింతయోరిచికొంటిని,నోరువజాలనే నూరడుమింక

ప్రహ్లాద— అమ్మయిదేటికినష్టముపల్కెదు సమ్మతిజెందుముచంపఁగరా
నిమ్మశ్రీహరి యేగలఁడేటికి నుమ్మలింపఁగ నూరడుతల్లీ.

హిరణ్య— కానరమంతయుఁగానగనయ్యెనె యేవగమానుదు నీ
తులువరా చేవిప్పినివధింపకయుండిన భూవలయంబునఁ బోవు
నాకీర్తి.

లీల— మానుము నేటికి నీ నెఱికోపము సూనుఁడు బాలుఁడు శుద్ధ
ప్రాణనాథ-వైరము చూపకు నేను చేసెద వానికి బోధ.

20 హిరణ్య—రాగం-కాఫి ఏకతాళము.

విడిపింపు తలపోసి వీనిమతముఁ
విడకున్న వీనిఁ జంప విధియింతు నిక్కముగఁ
బడరాని బాధలింకఁ బడఁజేయువాఁడ సతీ.
భామరో నీకు కొడుకుండగా
వలెనని నీమానసమునఁ దలచితివే
తామసము మానవే దండించి
బోధించి వేధించి బాధించి సాధింపవే.

21 లీల—రాగం-మోహనకల్యాణి చాప్ తాళము.

మానుము నాయనా యీమతము కానవెత్రిడికా దుర్మతము
బాలకయాతఁడు తాళఁడు కోపము చాలును పాపమగుర.

22 హిరణ్య—రాగం-శుద్ధబంగాళ ఏకతాళము.

నాతో సరి పోర యేరీ వీరుల్ ధరానోఁడీ
నను గొల్వంగా హరబ్రహ్మాదుల్ కడు రారోరి.
నాకంటె వేఱొక్క నాథుఁడున్నాఁడే యీ లోకము లేలఁగ
అకులతను జెందు ఘననాకవాసులెందు
నాకు దాసులై నతులొనర్చుచున్నారే. ౧
ఎక్కువమాటల నేటికి నాడఁగ దక్కవు సుమ్మా
యెక్కడ నెప్పుడైన హరి నెంచినంతలోన
చక్కఁ జేదనీఁ యుక్కడంతుఁ బోరా.

23 కాలనా—రాగం-మాండ్ ఆటతాళము.

ఓరీ దురాత్మా విరోధంబు తగునా
పార చూడు వధియింతుఁ గదరా
పర్వతమునుండి పడఁద్రోతుఁ గదరా.
మూఢా యింకైనను మురారి వదలరా

పీడకున్న నీ ప్రాణమెపోవురా
గాఢముగాఁ గూపమునఁ బడెదురా.

24 ప్రహ్లాద—రాగం-కాఫి రూపకతాళము.

వాసుదేవా పీతాంబరా పతంగవాహనా
శ్రీసతీపతీ చిత్రవర్తనా ॥పల్లవి॥
దేవదేవా జనార్దనా దినేంద్రలోచనా
భావనాతీతా భద్రదాయకా ౧
నారాయణ దామోదరా నగారిపాలనా
శార్ఙగోవిందా శంభుసన్నుతా. ౨

25 నారద—రాగం-పీలు చాపుతాళము.

వారణ తారణ కారణభూరమానాయకాపురందరపోషణా
వినుతరతీ ధవజనకా శ్రీరఘునగదాధారిణా భూరమా
వరకమలాలయా భామా నాధా నిరంతర పావనా
భూరమా.

26 రాగం-సావేరి ఆటతాళము.

లీలా— రారతనయా బిరానకుమారా
నేనెమెల్లనుదయఁ బ్రేమనించరా ॥పల్లవి॥
హిరణ్య— అయ్యోనా పేరమే మంచినింక
నెయ్యమంతా సిగ్గినినుఁ
అయ్యోనేఁడెనిఁకఁ వెగిఁరార్పఁగా
నంపితినెకొంచమైన గరుణలేకహా
లీలా— అన్ననీ ముద్దుమో మందమూర నెన్నఁడింకఁ జూచుదాన
నన్నుఁ బ్రోవ సంగమా యున్నయింపె
నాయనా రాగదే నామది చెలంగఁగా.

27 ప్రహ్లాద—రాగం-సావేరి రూపకతాళము.

శ్రీవాసుదేవా మాధవా కావావెదాసుని
భావంబునందునిందనిన్ను నే నేవేళనెంచెద. ॥పల్లవి॥

నీపాదనీరజాతముల్ జూపవేకూరిమిఁ
గాపాడవేదయాకరా యాపన్నరక్షకా

28 హిరణ్య—రాగం-ఇఁగ్లీషునోటు.

ఘోరాపాపీ బుద్ధివిహీనా క్రూరాచారా మదాన్వదా
తీరునుమదమ్మిఁక నెదుటనిలువకుర తెగనఱకెద పద పద
విరోధినెంచెదె వీఱకివయ్యెదె దురాగతంబని తోఁచదురా
హరిహరియను నారడికూతలుదురుద్యమంబునఁద్రోయదురా
సురారిశేఖరుల్ కరాళరీతిగా బిరానవచ్చియీ
దురాత్మ్రజంపుఁడీ కరుణింపఁగ దఱిగాదు.

39 నారద—రాగం-శంకరాభరణం ఏకతాళము.

తలప రెజనులు హిరణ్యకశిపుని దైవముగాఁగ
అలఘువిచారుని అంచితఘనుని ఆశ్రితమందారు
హరియొందుకొ అహహఁడొందుకొ మనహిరణ్య
కశిపుఁడె పురుషోత్తముఁడని పూజించినకనుపుణ్యం బేమారు

30 ప్రహ్లాద—రాగం-లతాంగి చాపుతాళము.

అ హరియే పర దైవ మాహరియే ॥మారయాధారుణింగోనప్ల॥
దేహముల్ధరియించి తెలివింతగలవారు
దినదినమునుగొల్వ రాదే ॥శ్రీహరియే॥ ॥అను॥
పరమాదరమున భక్తుల నెల్లను నిరతంబుఁబ్రోచుఁగదా
హరిహరియనినామ స్మరణంబు సలిపిన
కరుణించురామకృష్ణ కవినుతుఁడా శ్రీహరియే-మాహరియే

31 ప్రహ్లాద—రాగం-కేదారగౌళ రూపకతాళము.

దయ యేపారఁగా భవ తాపాము పోమమ్మఁ
గాపాడరావే శ్రీహరీ
నేడు మాపాలనీకృపఁజూపుచుఁ బాపము లెల్ల బాపవే॥అను॥
ఘనవిలాసము మీఱఁగాఁగల కాలమున్గనుభక్తితో
నినుభజించెడువారమో వర నీరజాయత లోచనా

దినము చేయుదు మెంతయున్నదని దీని నీదగు సేవలన్
కనికరంబు చెలంగఁగా మముఁగావ రావె రమాధవా.
మన మానందముఁ జెంది జానారఁగా దయరానీయవే
కరుణానిధీ.

32 ప్రహ్లాద — రాగం-అసావేరి ఏకతాళము.

నీసరిమెవరున్నారు హరీ యిల
కరుణాకరోడనా శ్రితులఁగావఁగా
సరసిజాసనాద్యమరవందితా. ॥నీసరి॥
దేవసన్నుతా దినమణినయనా
బ్రోవఁగరావే యసురాహరా
భావమందునిం దల తునప్పుడున్
శ్రీవరా మహా దేవపూజితా.

33 బాలకులు — రాగం-కాఫి ఆదితాళము.

కరుణాలోకా వరశ్రీలోలా మముఁబాలింపవే దేవపాలా.
ఉచితాలాపములను లాలించి మము చాలకృపను గావరాదే
నీనామకీర్తనల్ నిరతంబుభక్తిచే మానసమునందునించి
యానందమారఁగా నందంబుమీఱఁగా యేనాఁడు నినుగొల్చు
వారమో వరశ్రీనాథ దయమీఱఁబ్రోవవే

34 ప్రహ్లాద — రాగం-కాఫి రూపకతాళము.

మురవైరి పాపహరా రావె ననుఁగావంగా
సరసిజభవ హరముఖసుర సన్నుతవర నామహరీ ॥శ్రీ॥
స్వాంతములోనని నున్ సన్నుతులన్ జేయుచుందున్
వింతగానీతనువున్ వేగతులన్ గనుచుందున్
చింతలంబాపవెయో శ్రీహరీ నినుగందున్
ఎంతయు నృభక్తినినే నెప్పుడున్నీ కథవిందున్
వంతలుదీరఁగా వాక్కులీడేరఁగాఁ జెంతకుజేరఁగా శ్రీరమణా

35 హిరణ్య—రాగం మధ్యమావతి ఆదితాళము.
కడమాటయిదో కృటికానీరా
విడిచెదో లేదో విష్ణునిచింతా ॥పల్లవి॥
కడికండలుగా గావించెదనీ
వడలిచావఁగా హరినెంచితివా.
పిసుగులనడచెద మెడవిఱచెదరా
పొడిచెద నేనిన్నెడ నేకనరా

36 ప్రహ్లాద—రాగం-గౌరీమనోహర ఆదితాళము.
భీతివారణా పీతాంబరా ప్రీతిఁగావవే మాతల్లిని ॥పల్లవి॥
ఏల్లవేళ నన్నెంచువాఁడనే విల్లసిల్లమా తల్లిఁగావవే ౧

37 ప్రహ్లాద—రాగం-నారోజు ఆదితాళము.
గోవింద దమోదరా నారాయణ
వనజాక్ష శ్రీనివాస ॥గోవింద॥
శ్రీమానాయక కామితదాయక
ప్రేమానుసంధాయక ॥నారాయణ-గోవింద॥ ౧
వేదవినోదన సాధుప్రసాదన
మాధవ మధుసూదనా ॥వనజాక్షగోవింద॥శ్రీనివాస ॥గో॥౨

38 బాలకులు—రాగం-శంకరాభరణం ఆదితాళము.
కోరిభజింతుము గోవిందుఁ బదినారాయణునిముకుందుఁ
నీరేజనేత్రుని నారసనాభుని వారసికన్యకానందుఁ
మానసమునందు మానానిభక్తివర దీనాది
హరనాభ్యాసుఁ శ్రీనివాసుఁ జ్ఞానబాసుఁ మీనాది
రూపవిలాసుఁ కరుణనందమనో వికాసుఁ ॥కోరి॥

39 హిరణ్య—రాగం బిలహరి ఝంపెతాళము.
చూపఁగాగలవెయో శుంఠహరిని ॥పల్లవి॥
చూపకుందువుసుమా పాపాత్మకా ॥అను॥
అన్నాఁడువైకుంఠ మంతయుఁ వెతకితిని

కానఁరాడాయెనా కలుషాత్ముఁడు
సీసుఁడౌమాధవుం డెటుపోయెఁ జెప్పరా
యేనాఁడు చేరారా యెందుండెరా
దీనుఁడై మానముం దిగనాడిచనినవాఁ
డేనాఁటి దైవముర యిటులాడఁగా

40 ప్రహ్లాద—రాగం-అభేరి ఆదితాళము.

ధరలోనఁ గలదేని సరిదైవ మరరే
సరసీజలోచనా సలలిత మోచన. ॥పల్లవి॥
అరుదారఁగరుణించి పరిపాలింపగరాదె
పరమేశరమా వరసుస్థిరకరుణన్ బరమాదరణన్
వినయంబు నిండారఁగ నినువేఁడు కొనుఁవాడ
మనసారఁగ వినినీదయ మనుపంగను రాదే
నను బ్రోవం గనువేఱే ఘనుఁడెవ్వ డున్నాఁడు
విసిపించెదనా మనవిన్ వేగన్ వినుమా రామకృష్ణనుత.

మంగళం. రాగం-చక్రవాకం ఆదితాళము.

శ్రీవరా మునివినుతా శ్రితపరిపాలన నిగమకళా
దేవా నందనా ధీరవినుతమంగళం
నీ అనుపమకరుణనునే వినుతిసల్పగలనా
యినశశివరనయనా ఘనాశ్రితా సనధనా
జనార్ధనా ఘనారినిచయ వినాశనా.
శ్రీలోల మముకరుణను పాలింపు తగమనవులనాలించి
సుఖవనధిని దేలించి మించీ రామకృష్ణా పాలా.
మంగళంమగు ॥శ్రీవరా మునివినుతా॥

Printed at Rama Vilasa Press, Bellary.